
RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

| | | | | | |
|---|---|---|---|---|---|
| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 172 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | మంగళవారం,డిసెంబర్,30,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 172 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Tuesday,December,30,2025 | PAGES : 8 RS : 4 /- |


## ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై
# ట్రంప్ కీలక ప్రకటన

**- జెన్ స్కీతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక భేటీ**

ఫ్లోరిడా: రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. శాంతి చర్చలు మునుపెన్నడూ లేనంతగా పురోగమించాయని, త్వరలోనే ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఫ్లోరిడాలోని తన మార్–ఎ–లాగో నివాసంలోఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్ స్కీతో జరిగిన సమా వేశం అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. “మేం చాలా బాగా చర్చించుకున్నాం.దాదాపు అన్ని అంశాలపై మాట్లాడుకున్నాం. ఇరు పక్షాలు శాంతికి ఎంతో దగ్గరగా ఉన్నాయి. యుద్ధం ముగియాలని అందరూ కోరుకుంటున్నారు” అని ట్రంప్ విలేకరులకు తెలిపారు.



## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు
# ప్రారంభం

**- హాజరైన సిఎం రేవంత్, విపక్షనేత కెసిఆర్**

- కెసిఆర్‌కు నమస్కరించి ఆరోగ్యంపై సిఎం వాకబు
- కెసిఆర్‌ను కలిసి పలకరించిన మంత్రులు
- కెసిఆర్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు
- అసెంబ్లీ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు





**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారం భమయ్యాయి. ఈ సందర్భంగా ముందుగా సంతాప తీర్మా నాలు ప్రవేశపెట్టారు. దివంగత నేత రాం రెడ్డి,దామో దర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డికి సభ సంతాపం ప్రకటించింది. మరోవైపు పెండింగ్‌బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు.



## తెలంగాణ రాష్ట్రాన్ని..
# వణికిస్తున్న చలి

**సింగిల్ డిజిట్ కు టెంపరేచర్**

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణ రాష్ట్రాన్ని తీవ్రమైనచలి వణికిస్తోంది. గత కొన్ని రోజులుగా ఉత్తర, దక్షిణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. ముఖ్యంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు నమోదైన గణాంకాలను పరిశీలిస్తే.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు)లో అత్యల్పంగా 7.1 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, నిర్మల్ వంటి జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రాబోయే సోమ, మంగళవారాల్లో చలి ఇంకా పెరిగే అవకాశం ఉందని.. సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ 14 జిల్లాలకు ‘ఆరెంజ్’ అలర్ట్ జారీ చేసింది.

## కేసీఆర్, నేను మాట్లాడుకున్నది
# మీకెలా చెబుతాను
## మీడియా ప్రతినిధులతో రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో తాను మాట్లాడిన విషయాలు మీకెలా చెబుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీకి హాజరైన కేసీఆర్ కొద్ది నిమిషాల్లోనే వెళ్లిపోయారు. శాసనసభ ప్రారంభం కాగానే రేవంత్ రెడ్డి, కేసీఆర్ వద్దకు వెళ్లి కరచాలనం చేసి ఆయన క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ సభలో రెండు నిమిషాలు మాత్రమే ఉన్నారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌ను అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశానని తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రతి సభ్యుడిని తాము గౌరవిస్తామని, కేసీఆర్‌ను ఈరోజే కాకుండా, ఆసుపత్రిలో ఉన్నప్పుడు కూడా కలిశానని గుర్తు చేశారు. అసెంబ్లీ నుంచి ఆయన వెంటనే ఎందుకు వెళ్లారో కేసీఆర్‌నే అడగాలని అన్నారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు..
# బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్

- సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ
- అందుకు ఎంపిటిసి, జడ్పిటిసిలపై వెనకడుగు
- తెలంగాణ తెచ్చిన నేతగా కెసిఆర్‌ను గౌరవించాలి
- మీడియా చిట్‌చాట్‌లో బిఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** అసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటూ కాకుండా పోయారని విమర్శించారు. వారు ఏ పార్టీలో ఉన్నారో కూడా చెప్పు కోలేకపోతున్నారని అన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ లో డోర్స్ క్లోజ్ అయ్యాయని స్పష్టం చేశారు. ఫిరాయించిన ఎమ్మెల్యేల స్థానంలో కొత్తవారికి అవకాశమి స్తామని కేటీఆర్ తెలిపారు. గ్రౌండ్‌లో బీఆర్ఎస్‌కు మంచి పట్టు ఉందని అన్నారు.







## జనవరి 3న కొండగట్టు అంజన్న ఆలయానికి
# పవన్ కల్యాణ్

- ఆలయం వద్ద భారీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్న పవన్ కల్యాణ్
- దీక్షా విరమణ మండపం, భారీ సత్రాల నిర్మాణాలకు భూమిపూజ చేయనున్న పవన్
- టీటీడీ నిధులు రూ.35.19 కోట్లతో అభివృద్ధి పనులు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాన్ని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ త్వరలో సందర్శించనున్నారు. 2026 జనవరి 3వ తేదీ శనివారం ఆయన కొండగట్టును సందర్శించనుండటంతో ఈ పర్యటన రాజకీయంగా, ఆధ్యాత్మికంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ పర్యటన సందర్భంగా ఆలయ అభివృద్ధికి సంబంధించి కీలక కార్యక్రమాల్లో పవన్ కల్యాణ్ పాల్గొననున్నారు.



## ఆరావళిపై ఇచ్చిన ఉత్తర్వులపై
# సుప్రీం స్టే

**కొత్తకమిటీతో ఆరావాళిపై అధ్యయనానికి ఆదేశం**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 29:** ఆరావళి పర్వత శ్రేణుల్లో మైనింగ్ వివాదంపై సిజెఐ జస్టిస్ సూర్యకాంత నేతృత్వంలో సోమవారం విచారణ సందర్భంగా కీలక నిర్ణయం ప్రకటించింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వు లను వెనక్కు తీసుకుంది. ఇటీవల ఆరావళి కొండలకు ఆమోదించిన నిర్వచనాలకు సంబంధించిన కొన్ని వివరణలు అవసరమని సుప్రీం కోర్టు సోమవారం పేర్కొంది, అదే సమయంలో ఈ అంశంపై గత నెలలో జారీ చేసిన తీర్పుపై స్టే విధించింది. గతంలో అధికారులతో కూడిన కమిటీ చేసిన సిఫార్సుల పర్యావరణ ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తామని కోర్టు పేర్కొంది. ఆరావళి కొండల నిర్వచనంపై దాఖలైన సమస్యపై సుమోటో కేసులో కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది.



## మావోలకు ప్రాణదాతగా మారిన
# డాక్టర్ రఫీక్ అలియాస్ మణ్‌దీప్

**- అడవుల్లోనే... గాయాల నుంచి బుల్లెట్లు తీయడం వంటి చికిత్సలు**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** మావోయిస్టు పార్టీ నానాటికీ బలహీనం అవుతోంది. భారీ ఎన్ కౌంటర్లు, లొంగుబాట్లు మావోయిస్టు పార్టీని పూర్తిగా బలహీనపరు స్తున్నాయి. అడవుల్లో పరిస్థితులు రోజు రోజుకీ ప్రతికూలంగా మారడం, భద్రతా బలగాల కూంబింగ్ లు, దాడులు పెరగడం, సరైన సదుపాయాలు లేకపోవడం వంటి కారణాలతో పార్టీ అగ్రనేతలు సైతం సరెండర్ బాట పడుతున్నారు. ఇలాంటి సమయంలో మావోయిస్టు పార్టీలో ఏళ్ల తరబడి రహస్యంగా పనిచేసిన ఓ డాక్టర్ గురించి సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అడవుల్లో, కనీస సదుపాయాలు లేని దండకారణ్యంలో మావోయిస్టులకు ఆ డాక్టర్ ప్రాణదాతగా మారాడు. ఆయనే డాక్టర్ రఫీక్ అలియాస్ మణ్‌దీప్. పంజాబ్‌కు చెందిన రఫీక్ ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడయ్యాడు.

# విద్యతో పాటు విలువల పెంపకంలో కీలక భూమిక పోషిస్తున్న మీడియా



- సెరినిటీ స్కూల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి

**నాగారం, డిసెంబర్ 29, (తెలంగాణ దిశ)** :తెలంగాణ దిశ తెలుగు దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ 2026ను సెరినిటీ స్కూల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. తెలంగాణ దిశ ఎడిటర్ మెరుగు చంద్రమోహన్ ఆధ్వర్యంలో స్కూలు ఉపాధ్యాయులతో కలిసి క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ దిశ పత్రిక సమాజంలో జరుగుతున్న రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలను ప్రజలకు నిష్పక్షపాతంగా అందిస్తూ విశేషమైన గుర్తింపు సాధించిందన్నారు. ప్రాంతీయ సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పత్రిక పాత్ర అభినందనీయమని కొనియాడారు.విద్యతో పాటు విలువల పెంపకంలో మీడియా కీలక భూమిక పోషిస్తోందని, సమాచారంతో పాటు ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే పత్రికల ప్రధాన లక్ష్యమని తెలిపారు. నూతన సంవత్సరంలో పత్రిక పాఠకుల అభిమానాన్ని మరింతగా చూరగొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పత్రిక ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పీఓకేలో తిరుగుబాటు భారత్ కి ఆయుధమా..

పాక్ ఆక్రమిత కశ్మర్ లో ఇప్పుడు ప్రజా తిరుగుబాటు జరుగుతోంది. ప్రజలంతా పాక్ ప్రభుత్వంపై తిరుగబడుతున్నారు. అన్నీ స్తంభించిపోయాయి. ప్రజల్ని కట్టడి చేయడానికి పాకిస్తాన్ పెద్ద ఎత్తున సైన్యాన్ని పంపింది. వారు ఆందోళనలపై కాల్పులు జరిపి కొంత మంది చనిపోవడానికి కారణం అయ్యారు. ఇది అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఇప్పుడు పీవోకేలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. తిరుగుబాటుదారులు పాకిస్తాన్ ప్రభుత్వం వద్ద 30కిపైగా డిమాండ్లు పెట్టారు. షాబాజ్ షరీఫ్ ప్రభుత్వం చర్చలకు కమిటీని నియమించిది. ఆ డిమాండ్లను తీర్చేంత శక్తి పాక్ ప్రభుత్వం వద్ద లేదు. ఏదో విధంగా టైంపాస్ చేయాలని.. ఘర్షణలు చెలరేగకుండా.. తిరుగుబాటును ఆపేయాలని అనుకుంటోంది. అక్కడ జరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘనపై భారత్ స్పందించింది. వాటికి పాకిస్తాన్ ను బాధ్యత వహించేలా చేయాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరుతోంది. ఇటీవల ఆఫ్ఘన్ శివార్లలో సొంత దేశ ప్రజలపై సైన్యంతో మిస్సైళ్ల దాడి చేయించింది పాకిస్తాన్. ముప్పై మందికిపైగా చనిపోయారు. వారంతా టెర్రరిస్టులని పాక్ చెప్పుకుంది.ఓ వైపు బలూచిస్తాన్, మరో ఆఫ్ఘన్ సరిహద్దు ప్రాంతాలు, మరో వైపు పీవోకే ఇలా.. అన్ని వైపుల నుంచి పాకిస్తాన్ సమస్యలను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో భారత్ పాకిస్తాన్ కు హెచ్చరికలు జారీ చేస్తోంది. ఆ దేశం మళ్లీ ఉగ్రవాద కార్యకలాపాలను పెంచుతోందని .. ఈ సారి కుట్రలు చేస్తే ప్రపంచ పటంలో లేకుండా చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తోంది.పహల్గాం దాడితో ఉగ్రవాదులపై ప్రతీకార చర్యగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ తర్వాత, పాక్ ఆక్రమిత కాశ్మీర్ గురించి చర్చ జరుగుతోంది.

# పత్రికలు ప్రజల గొంతుకగా పనిచేయాలి

## - ఏఎస్ రావునగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి



**ఏఎస్ రావునగర్, డిసెంబర్ 29, (తెలంగాణ దిశ)** :తెలంగాణ దిశ తెలుగు దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్%-%2026ను డాక్టర్ ఏఎస్ రావు నగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి పత్రిక ఎడిటర్ మెరుగు చంద్రమోహన్ లతో కలిసి ఆమె క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ దిశ పత్రిక ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా ప్రజల ముందుకు తీసుకువెళ్లడంలో ముందంజలో ఉందని ప్రశంసించారు. స్థానిక సమస్యలపై నిరంతర కథనాలతో ప్రజల్లో అవగాహన పెంపొందిస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగవ స్థంభమని, ప్రజల గొంతుకగా పనిచేయాల్సిన బాధ్యత పత్రికలపై ఉందని తెలిపారు. సమాజ అభివృద్ధికి దోహదపడేలా విలువైన సమాచారాన్ని అందిస్తున్న తెలంగాణ దిశ పత్రిక మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పత్రిక ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జున నగర్ కాలనీలో 'తెలంగాణ దిశ'

# నూతన కాలమాన ఆవిష్కరణ..



**కాప్రా, డిసెంబర్ 29, (తెలంగాణ దిశ)** : కుషాయిగూడ డివిజన్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీలో సోమవారం తెలంగాణ దిశ తెలుగు దినపత్రిక నూతన కాలమానిని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు.

పత్రిక ఎడిటర్ మెరుగు చంద్రమోహన్ ఆధ్వర్యంలో కాలనీ వాసుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు యావపురం రవి, ప్రధాన కార్యదర్శి మొగిలి కరుణాకర్ రెడ్డి లు మాట్లాడుతూ.. ప్రజలు, ప్రభుత్వం మధ్య వారధిగా పాత్రికేయులు నిర్వర్తిస్తున్న సేవలను ప్రశంసించారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చి పరిష్కార మార్గాలను చూపడంలో **'తెలంగాణ దిశ'** పాత్ర అభినందనీయమన్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బొల్లంపల్లి శ్రీకాంత్ రెడ్డి, సయ్యద్ సాదిక్, వెంకటేష్ గౌడ్, రమేష్ యాదవ్, వెంకటేష్ గౌడ్, మురళీకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరికి అభినందనల వెల్లువ



**ఏఎస్ రావునగర్, డిసెంబర్ 29, (తెలంగాణ దిశ)** :కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్గా బాధ్యతలు స్వీకరించిన శ్రీహరిని సోమవారం పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కొత్త అంజిరెడ్డి, కె. సీతారామరెడ్డి, పెద్ది నాగరాజు గుప్తా, సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, హీరాలాల్ తదితరులు శ్రీహరికి పుష్పగుచ్చం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాప్రా సర్కిల్ పరిధిలో పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలపై వెంటనే స్పందిస్తూ పరిష్కారం చూపాలని కోరారు. అధికారులు, రాజకీయ నాయకుల సమన్వయంతో పనిచేస్తే ప్రాంత అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని అభిప్రాయపడ్డారు.అలాగే అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పని చేయాలని సూచించారు. నూతన డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు, కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

## బిజెపి శ్రేణులకు ఎన్ వివిఎస్ఎస్ పిలుపు





**కుషాయిగూడ, డిసెంబర్ 29, (తెలంగాణ దిశ):** జిహెచ్ఎంసి ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వివిఎస్ఎస్ ప్రభాకర్ పిలుపు నిచ్చారు. సోమవారం కుషాయిగూడ లోని సరస్వతి శిశు మందిర్ స్కూల్ లో డివిజన్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్ అధ్యక్షతన భారతీయ జనతా పార్టీ కుషాయిగూడ డివిజన్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వివిఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికలలో అనుసరించవలసిన అంశాలపై చర్చించారు. అదే విధంగా పార్టీ గెలుపు కొసం తీసుకోవాల్సిన కార్యక్రమాల గురించి నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వేబోర్డు ఎస్ సిసి సభ్యులు ఎం.లక్ష్మణ్ గౌడ్, బిజెపి మీడియా సెల్ ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ తాళ్ళ ఆనంద్ గౌడ్, కంటెస్టెంట్ కార్పొరేటర్ కాసుల సురేందర్ గౌడ్, సీనియర్ నాయకులు డి. నాదం, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు రేగొండ వెంకటేశ్వర్లు, డివిజన్ ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, నాయకులు కె. విద్యాసాగర్, పి. సహదేవ్ గౌడ్, బొల్లా శ్రీనివాస్, పి. గణేష్ గౌడ్, బ్రహ్మాచారి, జనార్ధన్, దయానంద్, యాదయ్య, పిట్టలరాజు, శ్రీకాంత్, రత్నపురం వెంకటేష్ వెంకట్ యాదవ్, శివ, సుధాకర్, బండారు అనిల్, మధు, చల్లా శ్రీనివాస్, చల్లా లక్ష్మణ్, అరుణ్ పరుశురాం, శేఖర్ ముదిరాజ్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి న్యూ ఇయర్ సంధర్భంగా ఏర్పాట్లను పరిశీలించిన పోలీసులు







**కీసర,డిసెంబర్ 29, (తెలంగాణ దిశ)** :వైకుంఠ ఏకాదశి, న్యూ ఇయర్ సంధర్భంగా భక్తుల రద్దీని పురస్కరించుకుని శ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను కుషాయిగూడ ఏసిపి వెంకట్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందరరేగా ఆయన ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఏసిపి వెంకట్ రెడ్డి, కీసర సీఐ ఆంజనేయులు, జవహార్ నగర్ ట్రాఫిక్ సిఐ శివ శంకర్, సబ్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు ఈ సందరరేగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏర్పాట్ల పట్ల పోలీస్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందరరేగా ఆలయ ఫౌండర్ చైర్మన్మల్లారపు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భక్తులకుఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్నిఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు క్యూ లైన్ లో క్యూ పాటించి ఇతర భక్తులకు సహకరించాలని కోరారు.

# కోనసీమలో కొబ్బరి చెట్లు ఏమౌతున్నాయి..



**కాకినాడ,తెలంగాణ దిశ** :కోనసీమ పేరు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది పచ్చని కొబ్బరి చెట్లు. రోడ్డు.. ఆ రోడ్డుకు ఇరువైపులా ఉండే కోబ్బరి చెట్లు.. వాటి మధ్యన ప్రయాణం.. మనసుకు ఓ ప్రశాంతత. కానీ కోనసీమలో ఇప్పుడు ఆ కొబ్బరి చెట్లు కనుమరుగవతున్నాయి. కన్నకొడుకులా పెంచుకున్న ఆ కొబ్బరి చెట్లు వాడిపోతున్నాయి.. ఆ తర్వాత కూలిపోతున్నాయి. దీంతో ఆ రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. అసలింతకీ.. కొబ్బరి చెట్లు ఎందుకు కూలుతున్నాయి? దానికి కారణం ఏంటి? అసలేం జరుగుతోంది? సముద్రపు నీరు చేరడంతో కుళ్లిపోతున్న కొబ్బరి చెట్లు.. కోనసీమలోని కొబ్బరి చెట్లు చనిపోతుండటంతో ఇప్పుడు ప్రత్యక్షంగా 10 గ్రామాలు.. పరోక్షంగా 20 గ్రాముల రైతులు నష్టపోతున్నారు. దీనికి కారణం శంకర గుప్తం డ్రైనేజీ. వైనతేయ నదీ పాయలో సముద్రం పోటు సమయంలో వచ్చిన నీరు శంకర గుప్తం డ్రైనేజీ ద్వారా చింతలపూడి గ్రామం వరకు వెనక్కి రావడంతో కొబ్బరి తోటలలో ఆ సముద్రపు నీరు నిలిచిపోతుంది. శంకరగుప్తం మేజర్ డ్రైనేజీ వైనతేయ నది లింక్ ఉంది. శంకరగుప్తం డ్రెయిన్కి ప్రధానంగా నాలుగు లింక్ డ్రైనేజీలు ఉన్నాయి. ఒకటి అంతర్వేది, రెండు వేప చెట్టు డ్రెయిన్, పోలవరం డ్రెయిన్, నాలుగు ముత్యాల పేట డ్రెయిన్. ఈ నాలుగు డ్రెయిన్ల నుంచి వచ్చే నీరు వల్ల గ్రామాలు దెబ్బతింటున్నాయి. దీనికి అధ్యయ నం చేయడానికి హార్టికల్చర్, అగ్రికల్చర్, బి డబ్ల్యూటి, స్కాలర్స్, ఫిలాసఫర్స్, సైంటిస్టులు వచ్చారు.. వచ్చారు చూసారు వెళ్లారు గాని ఎవ్వరు నివేదికలు ఇవ్వలేదంటున్నారు గ్రామస్తులు. రాఔఉఅ రిగ్గుల వేస్ట్ ఆయిల్ సముద్రంలో కలుస్తోందని ఆరోపణలు.. రాఔఉఅ రిగ్గులు గ్రామాల చుట్టుపక్కల ఎక్కువగా ఉండటంతో వాటి నుండి వచ్చే వేస్ట్ ఆయిల్ అంత సముద్రంలోకి విడిచి పెడుతున్నారని చెబుతున్నారు. సముద్రపు నీరు పూర్తిగా కలుషితమవుతుందన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇకపై తాము ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని చెబుతున్నారు. కోనసీమ నుంచి ఆర్మీలో పని చేస్తూ దేశానికి సేవలందిస్తున్నారు రాజేష్. మరో ఏడాదిలో రిటైర్మెంట్ తీసుకుని స్వస్థలానికి వచ్చి తన కొబ్బరి తోట చూసుకుందామనుకునేది ఆయన ఆలోచన. కానీ ఇప్పుడు తన తోటకు వస్తే దుఃఖం వస్తుందంటున్నారు. నేల కూలిన కొబ్బరి చెట్లను చూసి గుండె బరువెక్కుతుందని ఆవేదన చెందుతున్నారు. కొబ్బరిపై ఆధారపడ్డ పరిశ్రమలు మూతపడ్డాయన్న రైతులు.. కోనసీమ కొబ్బరి రైతులు ఇలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని 2014 ఇప్పటివరకు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు అదే గ్రామానికి చెందిన దొరబాబు అనే వ్యక్తి. కొబ్బరికాయలు ఎక్స్‌పోర్ట్ చేయడం.. కొబ్బరి తాడును తయారు చేయడం.. ఇలా అనేక పరిశ్రమలు ఇప్పుడు ఈ ప్రాంతంలో మూతపడ్డాయంటున్నారు. ఆదాయం లేక చాలా మంది పూర్తిగా గ్రామాన్ని వదిలి వలస వెళ్లే పరిస్తితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఆయన. రాజోలు నియోజకవర్గంలో అనేక గ్రామాలలో రాఔఉఅ రిగ్గులు ఉన్నాయి. వీటి నుంచి వచ్చిన వ్యర్థ ఆయిల్ని సముద్రంలోకి వదులుతున్నారని చెబుతున్నారు.

# చేశాం... చెప్పుకోలేకపోయాం!

**కడప,తెలంగాణ దిశ** :మేం చేసింది చెప్పుకోలేకపోయాం. ప్రజలకు అన్నీ చేశాం కానీ? వాటిని ప్రచారం చేసుకోలేకపోయాం.. ఇటీవల జగన్మోహన్ రెడ్డిపార్టీ శ్రేణుల వద్ద వ్యక్తంచేసిన బాధ ఇది. అయితే ఆయన బాధకు కారణం కూటమి ప్రభుత్వంచర్యలు. ఒకవైపు అభివృద్ధిచేస్తోంది. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఎక్కడా ఆర్భాటం చేయడంలేదు.కానీ ప్రజల్లోకికూటమి ప్రభుత్వంపనులు వెళుతున్నాయి. ప్రజల నుంచి సానుకూలత వస్తోంది. అలాగని వైసీపీ మాదిరిగా వాలంటీర్లు లేరు.

ఐ ప్యాక్ లాంటి టీం కూడా లేదు. అయినా సరే కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ప్రజల్లోకి వెళ్తున్నాయి. దీనిని చూసి జగన్మోహన్ రెడ్డి తలలు పట్టుకుంటున్నారు. అయితే అప్పటికీ, ఇప్పటికీ ఆయన తేడా గుర్తించలేకపోవడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లోటు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో వాలంటీర్లు ఉండేవారు.

ప్రతి 50 కుటుంబాల బాధ్యతల ను చూసేవారు. వారే ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేసేవారు. చక్కటి చిరునవ్వుతో లబ్ధిదారులను పలకరించేవారు. అయితే ఆ పింఛన్ అందిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కాదని.. అసలు ప్రజా ప్రతినిధులతో సంబంధం లేదని.. వాలంటీర్ల చొరవతోనే తమకు పింఛన్లు అందుతున్నాయని భావించేవారు లబ్ధిదారులు.

అస్సలు పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు, మంత్రుల జోక్యం ఉండేది కాదు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అలా కాదు. సీఎం చంద్రబాబు ప్రతినెలా ఒకటో తేదీన ఏదో ఒక జిల్లాకు వెళ్తున్నారు. స్వయంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.

# సంపాదకీయం

## సుంకాలపై మౌనమేల?

ఆధిపత్య ధోరణికి అహంకారమూ, అరాచకమూ తోడైతే ఎలా ఉంటుందో– అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరు తెన్నులను పరికిస్తే అర్థమవుతుంది. తాను అనుకుంటున్నట్టుగా ప్రపంచాన్ని నడిపించటానికి సుంకాల బెత్తం ఝళిపించి, పెత్తనం చెలాయించాలని రెండోసారి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచీ పేట్రేగుతున్నాడు. అధిక సుంకాలు విధిస్తానని గత ఏప్రిల్‌లోనే ఇండియా, చైనా, బ్రెజిల్, మెక్సికో, కెనడా సహా 30 దేశాలను బెదిరించిన ట్రంప్ %ొ% చైనా తదితర దేశాల నుంచి ఎదురు సుంకాలు గొంతెత్తటంతో– అమలుకు 90 రోజులు గడువంటూ మిన్నకున్నాడు. ఒకపక్క ఇండియా %–% అమెరికా మధ్య చర్చలు జరుగుతుండగానే– మన ఎగుమతులపై 25 శాతం సుంకాలను విధించటం, ఇది ఆగస్టు 1 నుంచే అమల్లోకి వస్తుందంటూ ఏకపక్షంగా ప్రకటించటం అమెరికా ఆధిపత్య ధోరణికి, ట్రంప్ అహంకార వైఖరికి నిదర్శనం. ఏదోవిధంగా మనదేశంపై తీవ్ర ఒత్తిడి తెచ్చి, తమ వాణిజ్య ప్రయోజనాలను సాధించాలన్నది అమెరికా వ్యూహం. దీనికి భారత్ నుంచి సరైన, దీటైన సమాధానం ఇవ్వటం చాలా అవసరం. కానీ, నోరు మెదపటానికి సైతం మన ప్రధాని మోడీ వెనకాడుతుండటం విచారకరం. ఏ దేశమైనా తాను ఉత్పత్తి చేసే సరుకులను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంది. తనకు అవసరమైన వస్తువులను అనువైన ధరలకు ఇచ్చే దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇది కనీస వ్యాపార సూత్రం. ఎక్కడి నుంచి ఎంతకు కొనాలో, సుంకాలు ఎంతెంత ఉండాలో ఏ దేశమూ ఏకపక్షంగా నిర్ణయించజాలదు. అమెరికా ధోరణి ఈ ప్రాథమిక నియమానికి భిన్నంగా ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే రష్యా అత్యంత చౌకగా ముడి చమురు, సహజ వాయువును సరఫరా చేస్తోంది. భారత్, చైనా తమ అవసరాలకు రష్యా నుంచి కొనుగోలు చేస్తున్నాయి. అమెరికా అనుంగు ఆయిల్ కంపెనీలకు ఇది నష్టదాయకంగా పరిణమించింది. దీంతో, రష్యాతో ఎలాంటి వాణిజ్య లావాదేవీలు జరిపినా ఊరుకునేది లేదని నెలరోజుల క్రితం అమెరికా హూంకరించింది. నాటో కూటమి సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే కూడా తీవ్రమైన పరిభాషతో మన దేశాన్ని హెచ్చరించాడు. రష్యాతో వాణిజ్య వ్యాపారాలను వెంటనే నిలిపేయాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందని బెదిరింపులకు తెగించాడు. ఒక సర్వ సత్తాక స్వతంత్ర దేశాన్ని ఇలా బెదిరించటానికి అతడికున్న దన్నేమిటి? ఒకపక్క మోడీ తానే ట్రంప్‌కు ప్రియమైన మిత్రుడైనట్టు పోజులిస్తుంటే– అమెరికా నుంచి ఈ తరహా పరోక్ష, ప్రత్యక్ష అదిలింపులూ, ఒత్తిళ్లలో అర్థమేమిటి? వెన్నెముక ఉన్న ఏ ప్రభుత్వమైనా ఇలాంటి ధోరణులపై తక్షణం స్పందించాలి. అవసరం లేని అంశాలపై రాద్ధాంతాలు చేసిబీ ఆత్మగౌరవానికి, సార్వభౌమత్వానికి భంగం వాటిల్లే విషయాలపై మాట్లాడకుండా మిన్నకుండడం సమంజసం కాదు. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' నినాదం తలకెత్తుకున్న ట్రంప్.. ముంచుకొస్తున్న ఆర్థికమాంద్యం నుంచి తప్పించుకోవటానికి అధిక సుంకాలు విధించటం, యుద్ధాయుధ అమ్మకాలను పెంచటం ఓ గొప్ప పరిష్కారంగా ఎంచుకొని ఆ దిశగా పావులు కదుపుతున్నాడు. దరిమిలా విస్తారమైన అవకాశమున్న మనదేశంలోకి తమ వ్యవసాయ, డైరీ ఉత్పత్తులతో ముంచెత్తాలని అమెరికా తీవ్ర ఒత్తిడి తెస్తోంది. మోడీ ప్రభుత్వం ఆ ఒత్తిళ్లకు తలొగ్గి, ఇప్పటికే లక్షల కోట్ల విలువైన ఆయుధాల కొనుగోలుకు, చమురు దిగుమతికి అంగీకరించింది. మరింత వాణిజ్య చొరబాటుకు ట్రంప్ పరివారం మంత్రాంగం నడుపుతోంది. వ్యవసాయ, పాల ఉత్పత్తులు, ఔషధ రంగాల్లోకి తన కార్పొరేట్ మద గజాలను దించాలని ప్రయత్నిస్తోంది. ఈ పన్నాగంతోనే తీవ్ర ఒత్తిళ్లకు, పెత్తందారీ పోకడలకు దిగుతోంది. అమెరికా అభీష్టానికి అనుకూలంగా తలూపితే మన వ్యవసాయ, పాడి పరిశ్రమ రంగాలకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. పెట్రో ధరలు పెచ్చు పెరిగి, నిత్యావసరాలపైనా ఆ భారం పడుతుంది. ఇప్పటికే నిరుద్యోగం, అల్పాదాయాలు, అధిక ధరలతో సతమతమవుతున్న దేశ ప్రజానీకానికి ఇది మరింత దుర్భర స్థితిని కలిగిస్తుంది. కాబట్టి– మోడీ ప్రభుత్వం దేశ సార్వభౌమత్వాన్ని నిలబెట్టేలా అమెరికాకు గట్టి సమాధానం చెప్పాలి. దేశ ప్రగతికి, ప్రజలకు నష్టం కలిగించే వాణిజ్య ఒప్పందాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు. నష్టదాయక ఒప్పందాలూ, కష్టకారక లొంగుబాట్లూ వద్దంటూ ప్రజలూ గొంతెత్తాలి..!

## ఉక్రెయిన్ - రష్యా సంబంధాలు

# జియో పొలిటికల్ దృష్టికోణం

ఉక్రెయిన్, రష్యా సంబంధాలను ఆధిపత్యం, బాధితత్వం అనే సరళ కథగా కాకుండా, ఒకే మూలాల నుంచి వికసించిన సంయుక్త నాగరికతగా చూడాలి. కీవియన్ – రూస్ వారసత్వం నుంచి రష్యన్లు, ఉక్రెయిన్‌లు ఒకే చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రవాహంలో ఎదిగారు. ఆధునిక సార్వభౌమత్వ భావనలను పూర్వకాల వాస్తవాలపై వెనుకకు అమలు చేయడం ఈ ఉమ్మడి గతాన్ని వక్రీకరించి, అప్పట్లో సౌమ్యంగా ఉన్న విభేదాలను అతిశయపరుస్తుంది.

17వ శతాబ్దం నుంచి ఉక్రెయిన్ భూభాగాలు రష్యా రాష్ట్రంలో కలవడం ప్రధానంగా సామ్రాజ్య బలవంతం వల్ల కాదుబీ భౌగోళిక%–%రాజకీయ అవసరాలు, పరస్పర భద్రతా ఆందోళనల వల్ల జరిగింది. పోలిష్, లిథువేనియన్ ఆధిపత్యం, ఒట్టోమన్ విస్తరణ, అంతర్గత విచ్ఛిన్నం వంటి ముప్పులు ఉన్న ప్రాంతంలో రష్యాతో కలయిక రక్షణ, స్థిరత్వం, పెద్ద రాజకీయ, ఆర్థిక వ్యవస్థలో ఏకీకరణను అందించింది. నేటి విమర్శల్లో కనిపించే పరిపాలనా కేంద్రీకరణ అప్పటి రాష్ట్ర నిర్మాణానికి సాధారణ పద్ధతే, ఉక్రెయిన్ గుర్తింపును అణిచే ప్రత్యేక ప్రయత్నం కాదు.

రష్యా సామ్రాజ్యంలో సాంస్కృతిక, భాషా సమ్మేళనం సంస్కృతి నిర్మూలనకు దారి తీసిందని చెప్పలేం.

ఇది విస్తృత తూర్పు స్లావిక్ గుర్తింపుకు రూపకల్పన. ఉక్రెయిన్‌ను వలస అంచుగా చూడలేదుబీ సామ్రాజ్య పరిపాలన, సైనిక నాయకత్వం, మేధో జీవితంలో కీలక పాత్ర పోషించింది. ఆర్థిక ఏకీకరణ వల్ల వ్యవసాయ అభివృద్ధి, పరిశ్రమల వృద్ధి, విస్తృత మార్కెట్లకు ప్రవేశం లభించింది, ఒంటరిగా సాధ్యం కానివి.

సోవియట్ కాలం కష్టాలు, విషాదాలతో నిండి ఉన్నా, అన్ని సోవియట్ గణరాజ్యాలు ఎదుర్కొన్న వేగవంతమైన ఆధునీకరణ సందర్భంలోనే దీనిని అంచనా వేయాలి. పరిశ్రమీకరణ, విద్యుతీకరణ, విద్య, శాస్త్రీయ పురోగతుల ద్వారా ఉక్రెయిన్ పెద్దగా లాభపడి, యూఎస్ఎస్ఆర్‌లో అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ఒకటైంది. కరువు, అణచివేత వంటి విపత్తులు తీవ్ర విషాదకరమైనవే అయినా, అవి వ్యవస్థాగత వైఫల్యాలు, సిద్ధాంత అతిశయాల ఫలితాలుబీ ఉక్రెయిన్‌ను లక్ష్యంగా చేసుకున్న ప్రత్యేక చర్యలు మాత్రమే కావు.

సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తర్వాత కూడా రష్యా ఉక్రెయిన్‌ను చరిత్ర, ఆర్థికం, భద్రతతో బంధించబడిన సన్నిహిత భాగస్వామిగా చూసింది. అయితే బాహ్య శక్తుల ప్రోత్సాహంతో ఉక్రెయిన్ ఆకస్మిక భౌగోళిక, రాజకీయ మార్పు, ఏర్పడిన పరస్పర ఆధారాన్ని దెబ్బతీసింది. శక్తి, భద్రత, ప్రాంతీయ స్థిరత్వంపై రష్యా స్పందనలు సామ్రాజ్య ఆకాంక్షల కన్నా చట్టబద్ధ జాతీయ ప్రయోజనాల వల్లనే వచ్చాయని రష్యా వాదన. రష్యా దృష్టిలో సమస్య ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని గుర్తించకపోవడం కాదుబీ ఉమ్మడి చారిత్రక బాధ్యతలు, పరస్పర కర్తవ్యాలను ఉక్రెయిన్ తిరస్కరించడం. భౌగోళిక వాస్తవాలు, ఆర్థిక పరస్పరాధారం, భద్రతా సున్నితతలను అంగీకరిస్తే సహకారం సాధ్యమే.

సమతుల్యంగా చూస్తే, రష్యాతో అనుబంధం ద్వారా ఉక్రెయిన్ స్థిరమైన ఆర్థిక అభివృద్ధి, పరిశ్రమ సామర్థ్యం, భద్రతను పొందిందిబీ విస్తృత ఉమ్మడి ప్రాంతంలో స్థిరత్వ భారాన్ని రష్యా మోసింది. సంబంధాల పతనం సహజ ఆధిపత్యం వల్ల కాదుబీ చరిత్ర రాజకీయీకరణ, ఒకప్పుడు ఏకీకృత నాగరిక ప్రాజెక్ట్ విచ్ఛిన్నం వల్ల. ఈ ఉమ్మడి వారసత్వాన్ని గుర్తించకపోవడంతో, ఒకప్పుడు బలం అయిన సాన్నిహిత్యం కృత్రిమ విభజన రేఖగా మారింది.

ఉక్రెయిన్‌కు లభిస్తున్నది సమాధులే.

"ఉక్రెయిన్ యూరప్‌ను కాపాడుతోంది" అనే రొమాంటిక్ వాదన పరిశీలనకు తట్టుకోదు. నిజంగా యూరప్ ప్రమాదంలో ఉంటే, యూరోపియన్ సైనికులు కూడా ఉక్రెయిన్‌లతో పాటు మరణించేవారు. అలా జరగడం లేదు. ఉక్రెయిన్ భాగస్వామి కాదు, బఫర్‌గా ఉపయోగించబడుతోంది.

రష్యా ప్రవర్తనను నైతికంగా తీర్పు వేస్తారు గానీ, సందర్భంతో అరుదుగా చూస్తారు. అమెరికా సహా ఏ మహాశక్తి తన సరిహద్దుల్లో శత్రుత్వ సైనిక కూటములను అంగీకరించదు. మోన్రో సిద్ధాంతం తిరుగుబాట్లు, దాడులతో అమలైందిబీ నాటో విస్తరణను "సార్వభౌమ ఎంపిక"గా సమర్థిస్తున్నారు. ఇది సూత్రబద్ధత కాదు, సౌకర్యం.

ఉక్రెయిన్ భౌగోళికం, చరిత్ర, శక్తి అసమానతలను నిర్లక్ష్యం చేసింది. పాశ్చాత్య ప్రశంసలను పాశ్చాత్య నిబద్ధతగా భావించింది. ఇప్పుడు తేల్చి గెలవలేని, త్వరగా ఓడిపోవడానికి కూడా అనుమతి లేని యుద్ధంలో చిక్కుకుంది.

ఈ యుద్ధాన్ని కొనసాగించడం ప్రతిఘటన కాదు, జాతీయ క్షీణత. దేశ భవిష్యత్తును సరిహద్దులు కాదు, జనాభానే నిర్ణయిస్తుంది. జనాభా తగ్గిన, అప్పుల్లో కూరుకుపోయిన, అవయవాలు కోల్పోయిన ఉక్రెయిన్ యూరప్‌లో "ఏకీకృతం" అయినా, అది సార్వభౌమం కాదు, శాశ్వత ఆధారితమే. శాంతి అశుభ్రంగా ఉంటుంది, అలా ఎప్పుడూ ఉంటుంది. కానీ అంతులేని యుద్ధం మరింత చెడు.

యుద్ధం ఆపడం అంటే రష్యాను ప్రేమించడం కాదు. ప్రతీకలకన్నా జీవనాన్ని ఎంచుకోవడం. తటస్థత ద్రోహం కాదుబీ పరిమితులను అర్థం చేసుకున్న రాష్ట్రాల సాంప్రదాయ వ్యూహం. ఉక్రెయిన్ విషాదం ఆక్రమణ మాత్రమే కాదు, నైతిక పదజాలంతో భౌగోళికాన్ని మార్చగలమని నమ్మించబడటమే. చప్పట్లను శక్తిగా పొరబడిన దేశాల పట్ల చరిత్ర నిర్దయగా ఉంటుంది.

ఉక్రెయిన్ వద్ద ఉన్న 8 లక్షల భారీ ఆయుధ సైన్యం ఆత్మవిశ్వాసానికి కాదు, బలవంతానికి సూచిక. శక్తివంతమైన పొరుగుదేశాన్ని ఎదుర్కొనే చిన్న దేశం భయాన్ని కేంద్రంగా చేసుకుని జాతీయ జీవనాన్ని పునర్వ్యవస్థీకరిస్తుంది: యువతను మానవ వనరులుగా, ఆర్థిక వ్యవస్థను రక్షణ సరఫరాలుగా, ప్రజాస్వామ్యాన్ని అత్యవసర ఏర్పాటుగా మారుస్తుంది. విస్తృత భౌగోళికం, జనాభా, వనరుల రక్షణ ఉన్న అమెరికా లేదా రష్యాలకంటే భిన్నంగా, ఉక్రెయిన్‌కు శాశ్వత సైనికీకరణను మోయగల జనాభా లోతు లేదు. భారతదేశంలో పెద్ద సైన్యం పరిమాణం, వైవిధ్యంపై ఆధారపడి ఉందిబీ పాకిస్తాన్‌లో సైనికీకరణ పౌర జీవితాన్ని కమ్మేసి అభివృద్ధిని అడ్డుకున్న ఉదాహరణ కనిపిస్తుంది. చిన్న దేశానికి ఇంత భారీ సైన్యం సమాజాన్ని ఖాళీ చేసి, పునర్నిర్మాణాన్ని ఆలస్యం చేసి, స్వేచ్ఛలను కుదించి, యుద్ధాన్ని అపవాదం కాకుండా వ్యవస్థగా మార్చే ప్రమాదం ఉంది, దేశమే చెల్లించే భద్రతా ధర.



రాయ్ రావు రామ్మోహన్
విశ్రాంత ప్రొఫెసర్
సెల్ : 94412 26838


# పెద్దిరెడ్డి ఫ్యామిలీ దూరమౌతోందా?



**కడప,తెలంగాణ దిశ :**జైలు నుంచి విడుదలైన మిధున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డిని ఎందుకు కలవలేదు? జగన్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ఎందుకు తన ఇంటికి పిలవలేదు? పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సడన్ గా ఎందుకు ప్రెస్ మీట్ పెట్టారు? చంద్రబాబుతో ఎటువంటి ఒప్పందం లేదని ఎందుకు చెప్పారు? చివరివరకు జగన్మోహన్ రెడ్డి తోనే తాము నడుస్తామని ఎందుకు ప్రకటించారు? చంద్రబాబు తమను వేధిస్తున్నారని ఎందుకు చెప్పారు? ఇప్పుడు పొలిటికల్ వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. పెద్దిరెడ్డి కుటుంబం అంటేనే చంద్రబాబుకు ప్రత్యర్థి. ఆపై దశాబ్దాల వైరం. అదే పెద్దిరెడ్డి వైయస్సార్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. రాజశేఖర్ రెడ్డి తో మంచి అనుబంధము ఉంది. ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి రాజకీయ ప్రయాణంలో అడుగులు వేసింది ఈ కుటుంబం. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తరువాత పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి జగన్ అత్యంత ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. అయితే సడన్ గా ఈ పరిణామాలు ఏంటి? అనేది పొలిటికల్ వర్గాల్లో ఒక రకమైన చర్చ. వరుసగా జరుగుతున్న పరిణామాలతో ఏదో జరుగుతోందన్న అనుమానాలు మాత్రం పెరుగుతున్నాయి.జగన్మోహన్ రెడ్డి కోసం పరితపించారు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అప్పట్లో కాంగ్రెస్‌లో ముఖ్య మంత్రిగా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డిని తీవ్రంగా వ్యతిరేకించి.. జగన్మో హన్ రెడ్డికి అండగా నిలబడ్డారు. రాయలసీమ మొత్తాన్ని జగన్మోహన్ రెడ్డి కంట్రోల్లో పెట్టే విధంగా పావులు కదిపారు పెద్దిరెడ్డి. అందుకే జగన్మోహన్ రెడ్డి సైతం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారు. అయితే 2024 ఎన్నికల ఫలితాలు జగన్మోహన్ రెడ్డిని ఆశ్చర్యపరిచాయి. పెద్దిరెడ్డి పై అనుమానం పెంచాయి. రాయలసీమ మొత్తం కూటమి ప్రభంజనం సృష్టిస్తే.. చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబం ఎలా గెలిచింది అన్నది జగన్మోహన్ రెడ్డిలో పుట్టుకొచ్చిన అనుమానం. ఏదైనా మ్యాచ్ ఫిక్సింగ్ ఉందా? అన్నంతగా అనుమానం పెరిగినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇవి క్రమేపి పెరుగుతూ వచ్చాయి. పెద్దిరెడ్డి కుటుంబాన్ని జగన్ దూరం చేసుకునే పరిస్థితి వచ్చినట్లు బయట ప్రచారం జరుగుతోంది.అయితే ఈ మొత్తం పరిణామాల వెనుక సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారు అన్నది ప్రధాన ఆరోపణ. బయట కూడా అదే ప్రచారం సాగుతోంది. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితులు, పార్టీలో నెంబర్ 2 స్థానానికి ఎదిగిన నేతలను.. ఒక పద్ధతి ప్రకారం బయటకు పంపించడంలో సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర ఉందన్నది ఒక అనుమానం. ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం ఆధిపత్యాన్ని సహించలేకపోయారట సజ్జల. పైగా వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆర్థిక వ్యవహారాలన్నీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి చూసేవారు. పార్టీ కోసం తాము కష్టపడితే ఆర్థికంగా పెద్దిరెడ్డి కుటుంబం బలోపేతం అయింది అన్నది సజ్జలలో ఉన్న అనుమానం అని వైసిపి వర్గాలు అంతర్గత చర్చలో చెబుతుంటాయి. అందుకే ఒక వ్యూహం ప్రకారం జగన్మోహన్ రెడ్డిలో అనుమానాలు పెంచడంలో సజ్జల రామకృష్ణారెడ్డి సక్సెస్ అయినట్లు తెలుస్తోంది. అందుకే లిక్కర్ కుంభకోణం జరిగిన తర్వాత పూర్తిగా సీన్ మారినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొన్ని రకాల ఒప్పందాలు జరిగినట్టు.. కూటమి ప్రభుత్వానికి పెద్దిరెడ్డి కుటుంబం సరెండర్ అయినట్లు ఒక కొత్త ప్రచారం పుట్టుకొచ్చింది. ఇవన్నీ పెద్దిరెడ్డి కుటుంబానికి తీవ్ర మనస్తాపానికి గురిచేసినట్లు తెలుస్తోంది. అయితే ఒకే ఒక్క వ్యూహంతో వైసీపీలో పెద్దిరెడ్డి ప్రత్యర్థులు ప్రచారం మొదలు పెట్టినట్లు సమాచారం. ఆయన ముందు ఏకైక ఆప్షన్ బిజెపి అన్నట్టు ఒక సీన్ క్రియేట్ చేసినట్లు తెలుస్తోందిగన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ ను స్వయంగా జైలుకు వెళ్లి పరామర్శించారు జగన్మోహన్ రెడ్డి. అటు తరువాత ఆయన బెయిల్ కోసం కూడా న్యాయ సహాయం చేశారు జగన్ మోహన్ రెడ్డి. జైలు నుంచి బయటకు వచ్చాక తన ఇంటికి పిలిపించుకొని మరి వల్లభనేని వంశీని పరామర్శించి ధైర్యం చెప్పారు. కానీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి విషయంలో అలా చేయలేదు. కనీసం పరామర్శించలేదు. తన ఇంటికి పిలవలేదు.అదే సమయంలో పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టారు.తమను చంద్రబాబు వేధించారని.. అతనితో ఎటువంటి ఒప్పందాలు లేవని తేల్చి చెప్పారు. అంతటితో ఆగకుండా జగన్మోహన్ రెడ్డి తోనే చివరి వరకు ప్రయాణం అని ప్రకటించారు. ప్రత్యేకంగా ఈప్రకటనచేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే జగన్ తో పెద్దిరెడ్డి కుటుంబానికి ఆ స్థాయిలో సాన్నిహిత్యం ఉంది. ఎప్పుడైతే మిధున్ రెడ్డి ఆ ప్రకటన చేశారు తెర వెనుక ఏదో జరుగుతోందన్న అనుమానం పెరిగింది. అయితే ఈ మొత్తం ఎపిసోడ్లో సజ్జల వైపే అందరి వేళ్ళు చూపిస్తున్నాయి.

# బంగారం ధరల దూకుడు

## రోజురోజుకు సరికొత్త రికార్డు – తాజాగా రూ.1.40 లక్షలకు చేరిక!




**హైదరాబాద్,తెలంగాణ దిశ :**ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి కారణంగా బంగారం ధరలుఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. బంగారం ధర రోజుకో సరికొత్త రికార్డును నమోదు చేస్తోంది. మొన్నటి వరకు 10గ్రాముల ధర రూ.లక్ష దాటితేనే ఔరా అనుకున్న వాళ్లంతా.. తాజాగా రూ.1.40 లక్షలకు చేరుకోవడం చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. అంతర్జాతీయంగానూ పుత్తడి ఔన్సు తొలిసారి 4వేల డాలర్ల మార్కును దాటింది. అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్, ఆ దేశ ఆర్థిక పరిస్థితిపై నెలకొన్న అనిశ్చితులు పసిడికి తాజాగా డిమాండ్ పెంచుతున్నాయి. బంగారం ధర బుధవారం మరింత పెరిగింది. ఒక్కరోజే రూ.2,290 పెరిగి ఆల్‌టైమ్ హైకి చేరింది. బుధవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర తొలిసారి రూ.1,26,070కి ఎగబాకింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,16,750కి చేరింది. మరోవైపు వెండి ధర కూడా బంగారంతో పోటీపడి మరీ పెరిగిపోతోంది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1.58 లక్షలుగా ఉందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. పసిడి ధరలు పెరగడానికి అనేక కరాణాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ట్రంప్ అధిక టారిఫ్‌లు, అంతర్జాతీయ భౌగోళిక పరిస్థితులకు తోడు అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్ కూడా ఓ కారణంగా పేర్కొంటున్నాయి. వడ్డీరేట్లను ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఇంకా తగ్గిస్తుందన్న అంచనాల మధ్య మదుపరులు తమ పెట్టుబడులను సురక్షిత సాధనమైన పుత్తడి వైపునకు మళ్లిస్తున్నారు. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. దీంతో పసిడి ధరలు అంతకంతకూ పెరుగుతూ పోతున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,25,780 వద్ద కొనసాగు తోంది. 22 క్యారెట్ల పసిడి రూ.1,12,900 పలుకుతోంది. అటు వెండి సైతం కిలో రూ.1.56 లక్షలు దాటింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4034 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 48.62 డాలర్ల వద్ద కొనసాగుతోంది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.79గా ఉంది.అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు బంగారానికి డిమాండ్ పెంచుతున్నాయి. ప్రజలు వెనకడుగు వేస్తున్నారు. పండగ సీజన్‌లో వ్యాపారాలు తగ్గడంతో ఆభరణ వ్యాపారులు సైతం ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# అమెరికాకు తగ్గిన భారతీయులు..

## 2001 తర్వాత ఇదే తొలిసారి

## ట్రంప్ సర్కారు నిర్ణయాలే కారణం



వాషింగ్టన్ : అమెరికాలో పర్యటించే భారతీయ సందర్శకుల సంఖ్య తగ్గింది. ఏటా జూన్‌లో అమెరికాకు భారతీయ సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. నిరుడు జూన్‌లో 2.3 లక్షల మంది వెళ్లగా, ఈ ఏడాదిలో 2.1 లక్షల మంది వెళ్లారు. అంటే, 8 శాతం తగ్గుదల నమోదైంది. ఈ స్థాయిలో తగ్గుదల నమోదు కావడం ఈ మిలీనియంలో ఇదే తొలిసారి. నిరుడు జూలైలో కన్నా ఈ ఏడాది జూలైలో 5.5 శాతం తగ్గుదల కనిపించింది. ఈ వివరాలను అమెరికా వాణిజ్య శాఖకు చెందిన నేషనల్ ట్రావెల్ అండ్ టూరిజం ఆఫీస్ వెల్లడించింది. మొత్తం మీద చూసినపుడు, కొన్ని నెలల నుంచి అమెరికాకు ఇతర దేశాల నుంచి వెళ్లే సందర్శకులు తగ్గిపోతున్నారు. నిరుడు జూన్‌తో పోల్చుకుంటే, ఈ ఏడాది జూన్‌లో 6.2 శాతం తగ్గిపోయారు. నిరుడు మే నెలలో కన్నా ఈ ఏడాది మే నెలలో 7 శాతం మంది, నిరుడు మార్చితో పోల్చినపుడు ఈ ఏడాది మార్చిలో 8 శాతం మంది, నిరుడు ఫిబ్రవరిలో కన్నా ఈ ఏడాది ఫిబ్రవరిలో 1.9 శాతం మంది అమెరికాకు విదేశీ పర్యాటకులు తగ్గిపోయారు.

నిరుడు జనవరితో పోల్చినపుడు ఈ ఏడాది జనవరిలో 4.7 శాతం పెరుగుదల కనిపించింది. నిరుడు ఏప్రిల్‌లో కన్నా ఈ ఏప్రిల్‌లో 1.3 శాతం మంది పెరిగారు.

అమెరికన్ వీసా మరింత భారం: భారత దేశం నుంచి అమెరికాకు వెళ్లే ప్రయాణికులు అక్టోబరు 1 నుంచి వీసా ఇంటెగ్రిటీ రుసుముగా 250 డాలర్లు (సుమారు రూ.22,000)ను చెల్లించవలసి ఉంటుంది. దీంతో మొత్తం వీసా ధర 442 డాలర్లు (సుమారు రూ.38,974) అవుతుంది. ఈ అదనపు భారాన్ని మెక్సికో, అర్జంటైనా, భారత్, బ్రెజిల్, చైనా వంటి నాన్ వీసా వెయివర్ దేశాల నుంచి వెళ్లే ప్రయాణికులు భరించవలసి ఉంటుంది.

హెచ్-1బీ, ఎఫ్-1 వీసాలకు వ్యక్తిగత ఇంటర్వ్యూలు తప్పనిసరి: ఇంటర్వ్యూ వెయివర్ లిస్ట్‌ను అమెరికా సవరించింది. దీంతో నాన్ ఇమిగ్రెంట్స్ సెప్టెంబరు నుంచి తప్పనిసరిగా వ్యక్తిగతంగా ఇమిగ్రేషన్ ఇంటర్వ్యూలకు హాజరుకావలసి ఉంటుంది.

వయసు పద్నాలుగేళ్ల లోపు, 79 ఏళ్లు పైబడిన దరఖాస్తుదారుల్లో అత్యధికులు ఇకపైన వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరుకావలసిందే. వీరికి ఇప్పటి వరకు మినహాయింపు ఉండేది. అయితే, వీసా వెయివర్ లిస్ట్‌లో ఉన్నవారు వ్యక్తిగత ఇంటర్వ్యూకు హాజరుకానవసరం లేదు. కొన్ని రకాల బీ1/బీ2 వీసాహోల్డర్స్ మాత్రమే ఇంటర్వ్యూ వెయివర్ బెనిఫిట్‌కు అర్హులు.

# ఆస్ట్రేలియాలో భారత వ్యతిరేక నిరసనలు!



## వందేండ్లలో వచ్చిన గ్రీకులు, ఇటాలియన్ల కంటే ఐదేండ్లలో వచ్చిన భారతీయులే ఎక్కువని ఆరోపణ

## ప్రతిగా శరణార్థుల రక్షణ సంఘం ర్యాలీ

కాన్‌బెర్రా : ఆస్ట్రేలియాలో వలసదారులకు వ్యతిరేకంగా, ముఖ్యంగా భారతీయులకు వ్యతిరేకంగా ఆదివారం దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. 'మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా' పేరుతో నిర్వహించిన ఆందోళనలో నిరసనకారులు ప్రధానంగా భారతీయులను లక్ష్యంగా చేసుకున్నారు. దేశ సాంస్కృతిక నిర్మాణానికి వారు ముప్పుగా మారారని ఆరోపించారు. పెద్దయెత్తున ఉన్న వలసవాదులకు వ్యతిరేకంగా దేశ రాజధాని సిడ్నీ సహా ప్రధాన నగరాలు, పట్టణాలలో ఆందోళన నిర్వహించారు. 5 నుంచి 8 వేల మంది ఆస్ట్రేలియా జాతీయ జెండాలు ధరించి సిడ్నీలో జరిగిన ఆందోళనలో పాల్గొన్నారు. 100 ఏండ్లలో వచ్చిన గ్రీకులు, ఇటాలియన్ల కంటే, ఐదేండ్లలో వచ్చిన భారతీయుల సంఖ్య ఎక్కువగా ఉందని వారు ఆరోపించారు. ఆ ర్యాలీ లక్ష్యం గురించి ఆందోళనకారుల గ్రూప్ వెబ్‌సైట్‌లో వివరించింది. ప్రధాన స్రవంతి రాజకీయ నాయకులు ఎప్పటికీ చేయలేనిది సాధించడం, సామూహిక వలసలను అంతం చేయాలని డిమాండ్ చేయడం తమ ర్యాలీ లక్ష్యం అని నిరసన బృందం శనివారం ఎక్స్‌లో పేర్కొంది. కాగా, నిరసనకారుల ఆందోళనకు ప్రతిగా శరణార్థుల హక్కుల రక్షణ సంఘం పేరుతో కొందరు ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా తీవ్రవాద ఎజెండాను వారు తీవ్రంగా నిరసించారు. వారి చర్య అసహ్యం, కోపాన్ని కలిగిస్తున్నదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, ఈ నిరసన ప్రదర్శనలను తాము వ్యతిరేకిస్తున్నట్టు కార్మిక శాఖ మంత్రి ముర్రే వాట్ తెలిపారు. వీటిని నియో-నాజీ సంస్థలు నిర్వహించిన, ప్రోత్సహించిన ఉద్యమమని ఆయన వ్యాఖ్యానించారు. విద్వేషాన్ని వ్యాప్తి చేసే, సమాజాన్ని విభజించే ఇలాంటి ఆందోళనలను తాము ప్రోత్సహించబోమని స్పష్టం చేశారు.

# తలనొప్పిగా మారిన యూరియ..?!



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు యూరియా చుట్టూ తిరుగుతున్నాయి. యూరియా సరైన స్థాయిలో సరఫరా కాకపోవడంతో తెలంగాణ రైతులు ఇబ్బంది పడుతున్నారు. కేంద్రం డిమాండ్ కు తగ్గట్టుగా యూరియా సప్లై చేయకపోవడంతో రైతులు అష్ట కష్టాలు పడుతున్నారు. వాస్తవానికి యూరియా సరఫరా చేయడం లేదని బిజెపి పార్లమెంట్ సభ్యుడు చెప్పినప్పటికీ.. గులాబీ పార్టీ మీడియా రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తోంది. తన అనుకూల సోషల్ మీడియా గ్రూపుల ద్వారా ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తోంది. ఇవేవీ తెలియని రైతులు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం అని చెప్పుకుంటున్నారు.స్థానిక ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో యూరియా కొరతను సాకుగా మార్చుకొని.. ఎన్నికల్లో లబ్ధి పొందాలని భారత రాష్ట్ర సమితి చూస్తోంది. ఇదే అదునుగా ఎరువు కష్టాలకు కారణం రేవంత్ ప్రభుత్వం అని ప్రొజెక్ట్ చేస్తోంది. దానికి తగ్గట్టుగానే కొంతమంది రైతులతో నెగిటివ్ కామెంట్స్ చేయించి సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం చేయిస్తున్నది.. దురదృష్టవషత్తు ఇలాంటి ప్రచారానికి అడ్డుకట్ట వేసి.. గట్టి కౌంటర్లు ఇవ్వాల్సిన అధికార పార్టీ సోషల్ మీడియా నిశ్శబ్దంగా ఉండిపోయింది. భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా చేస్తున్న ప్రచారాన్ని ఎండ కట్టడంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విఫలం అవుతూనే ఉంది. ఆ పార్టీ సోషల్ మీడియా ఎప్పటికీ మేల్కొంటుంది.. ఎప్పుడు గట్టి కౌంటర్లు ఇస్తుందో అంతు పట్టకుండా ఉంది.స్థానిక ఎన్నికల ముందు రైతులు పడుతున్న యూరియా కష్టాలు అధికార పార్టీకి ప్రతిబంధకంగా మారుతాయి అని విశ్లేషకులు అంటున్నారు. ఎందుకంటే రైతులకు యూరియా సప్లై చేసింది ఎవరనేది తెలియదు. పైగా తెలంగాణ రాష్ట్రంలో వరి సాగు పెరిగిపోయిన నేపథ్యంలో యూరియా కు విపరీతమైన డిమాండ్ ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి కేంద్రం కావలసిన స్థాయిలో యూరియా సప్లై చేయడం లేదని అధికార పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే కేవలం తెలంగాణలో మాత్రమే కాదని.. దేశ వ్యాప్తంగా యూరియా కొరత ఉందని బిజెపి నాయకులు అంటున్నారు.

అంతర్జాతీయంగా ఏర్పడిన పరిస్థితుల వల్ల యూరియా కొరత నెలకొందని.. త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని బిజెపి నాయకులు అంటున్నారు.. అయితే రైతులు మాత్రం

యూరియా కోసం ఎదురుచూసి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం కేంద్రం మీద ఒత్తిడి తీసుకొచ్చి.. కావలసిన ఎరువులను తెలంగాణకు తీసుకొస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్బంది ఉండదు. ఒకవేళ ఇదే తీరు కొనసాగిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిభంధకం తప్పదు. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే కంటే ముందు రేవంత్ ఈ సమస్యను పరిష్కరిస్తే సరిపోతుంది

# అగాధంలోకి రూపాయి

## డాలర్‌తో 61 పైసలు పతనం

## 88.19 ఆల్‌టైం కనిష్ట స్థాయికి చేరిక



ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి వెలవెలపోతోంది. ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ 88 స్థాయిని దాటింది. భారత్‌పై అమెరికా వేసిన భారీ టారిఫ్‌లకు తోడు, విదేశీ నిధుల బయటకు తరలిపోవడం, నెలాఖరు కావడంతో దిగుమతిదారులు డాలర్ల కొనుగోళ్లకు మొగ్గు చూపడం తదితర పరిణామాలు రూపాయి విలువను అగథంలోకి పడేశాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 61 పైసలు పతనమై 88.19కి దిగజారింది. ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం 87.73 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 88.33 అత్యల్ప స్థాయికి పడిపోయింది. ఇంతక్రితం ఫిబ్రవరి 10న ఇంట్రాడేలో 87.95 వద్ద నమోదయ్యింది. ఆగస్టు 5న 87.88 కనిష్ట స్థాయిని తాకింది. ఆ తర్వాత భారీ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. రూపాయి విలువ పతనం అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతులను భారం చేయనున్నాయి. మరోవైపు విదేశీ చెల్లింపుల భారం పెరగనుంది. అంతిమంగా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరగనుంది. "అమెరికా విధించిన భారీ సుంకాలు భారత వాణిజ్య లోటును పెంచుతాయని ఆందోళన కలిగిస్తున్నాయి. దెబ్బతిన్న దేశీయ మార్కెట్లు, విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు రూపాయిపై ఒత్తిడిని పెంచుతున్నాయి." అని మిరే అసెట్ షేర్‌ఖాన్‌లోని కరెన్సీ అండ్ కమాడిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ అనుజ్ చౌధరి పేర్కొన్నారు.

# ఏపీలో 'స్క్రబ్‌టైఫస్' కే కలకలం




**నెల్లూరు,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్‌లో 'స్క్రబ్ టైఫస్' కేసులు కలకలం రేపుతున్నాయి. నల్లిని పోలిన చిన్న కీటకం కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. ముఖ్యంగా చిన్న పిల్లలపై దీని ప్రభావం అధికం. జ్వరం, కండరాల నొప్పి, తలనొప్పి వంటి లక్షణాలుంటాయి. చికిత్స ఆలస్య మైతే మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌కు దారితీసి ప్రాణాంతకం కావచ్చు. నెల్లూరు జిల్లాలో నాలుగు కేసులు నమోదయ్యాయి. పరిసరాల శుభ్రత, ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి. లక్షణాలు కనిపిస్తే రక్త పరీక్ష చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.ఏపీలో 'స్క్రబ్ టైఫస్' కేసులు నమోదయ్యాయి.. నల్లిని పోలిన ఒక చిన్న కీటకం కుడితే ఈ స్క్రబ్‌టైఫస్ బారినపడతారు. ఇది ఇళ్లలో పెద్దవాళ్లు, పిల్లలను కుడుతుంది..కాకపోతే ముఖ్యంగాచిన్న పిల్లలపైదీని ప్రభావం ఎక్కువగా ఉంది. ఇప్పటికే డెంగీ, మలేరియా వంటి జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు స్క్రబ్ టైఫస్ టెన్షన్ మొదలైంది. కొండ ప్రాంతాల్లో కనిపించే ఈ కీటకాలు ఇప్పుడు అన్ని చోట్లకూ వ్యాపించాయంటున్నారుఒక కీటకం కుడితే నల్ల మచ్చ వస్తుంది. ఏడు రోజుల పాటు జ్వరం ఉంటుంది.

డెంగీ లాగే కండరాల నొప్పి, తలనొప్పి, జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. చికిత్స ఆలస్యం అయితే మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్‌కు దారి తీసి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. లక్షణాలను బట్టి యాంటీ బయోటిక్స్‌తో నయం చేయవచ్చు. కొన్నిసార్లు ఐసీయూ చికిత్స కూడా అవసరం అవుతుందని చెబుతున్నారు వైద్యులు.తాజాగా నెల్లూరు జిల్లాలో స్క్రబ్‌టైఫస్ కేసులు నమోదయ్యాయి. కావలి, వెంకటేశ్వర పురం, మనుబోలు, ఎన్టీఆర్‌నగర్‌లో ఈ ఏడాది 4 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. ముందస్తు జాగ్రత్తగా స్క్రబ్ టైఫస్ బాధిత కుటుంబ సభ్యులతో పాటుగా ఆ చుట్టుపక్కల వారికి ఈ వ్యాధి లక్షణాలు ఉన్నాయా? అని టెస్ట్‌లు చేస్తున్నారు. ఒకవేళ ఎవరికైనా స్క్రబ్ టైఫస్ లక్షణాలను గుర్తిస్తే వెంటనే వారి బ్లడ్ శాంపిల్స్ సేకరించి జీజీహెచ్‌కు పంపుతున్నారు.

ఈ టైఫస్ జ్వరం నిర్ధారణ కోసం వీల్‌ఫెలిక్స్ పరీక్ష చేయాలని సూచిస్తున్నారు డాక్టర్లు.ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని.. ముఖ్యంగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఒకవేళ ఇంట్లో పాత దిండ్లు, పరుపులు, మంచాలు, పరుపులు వంటివి తీసివేయడం మంచిదంటు న్నారు. ఈ కీటకాలు రాత్రి వేళల్లో ఎక్కువగా దాడి చేసే అవకాశం ఉందంటున్నారు. అందుకే పిల్లల కాళ్లు చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేయాలని సూచిస్తున్నారు. చెట్లు ఎక్కువగా ఉన్న చోట్ల, వ్యవసాయ భూముల పక్కన నివసించే వారిపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

ఈ పురుగులు ఎక్కువగా పొట్ట, బుగ్గలు, ఛాతి, పాదాలప కుడుతాయి అంటున్నారు.స్క్రబ్ టైఫస్ విషయంలో భయం అవసరం లేదని.. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామంటున్నారు డాక్టర్లు. ఒకవేళ ఎవరికైనా జ్వరం వచ్చి తగ్గకపోతే డెంగీ, టైఫాయిడ్, మలేరియాగా భావించినిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరుతున్నారు డాక్టర్లు.ఒకవేళ మచ్చలు కనిపిస్తే వెంటనే స్క్రబ్ టైఫస్ నిర్ధారించేందుకు రక్త పరీక్ష చేయించుకోవాలని సూచిస్తున్నారు. స్క్రబ్ టైఫస్ ప్రాణాంతకం కాదని.. ప్రజలకు ఆందోళన అవసరం లేదని.. కానీ ముందస్తు జాగ్రత్తలు కూడా అవసరం అంటున్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కీమ్ స్కాలర్షిప్ విద్యార్థుల తల్లిదండ్రుల ధర్నా..

**హనుమకొండ,తెలంగాణ దిశ :**జిల్లా కలెక్టరేట్ ఎదురుగా బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. స్కాలర్షిప్ మంజూరు చేయని కారణంగా తమ విద్యార్థులను సదరు విద్యాసంస్థల యాజమాన్యాలు వారి వారి విద్యాసంస్థల్లోకి చదువుల కోసం అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకు అనుమతించడం లేదని విద్యార్థుల తల్లిదం డ్రులు సదరు విద్యాసంస్థల యాజమాన్యాలను నిలదీయగా.. వారు తమకు ప్రభుత్వాల నుండి గత మూడు సంవత్సరాల నుండి ప్రభుత్వా లు ఎలాంటి స్కాలర్షిప్ మంజూరు చేయకున్నా విద్యార్థినీ విద్యార్థుల విద్యకు ఆటంకం రాకుండా తమ విద్యాసంస్థలను నిర్వహిస్తున్నట్లు తెలిపారని

చేసినట్లు బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో చదువులు కొనసాగు తున్న విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. మా బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు వారి వారి చదువులు నిరాటంకంగా కొనసాగించడానికి ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే పూనుకొని మిగిలి ఉన్న సుమారుగా తొమ్మిది కోట్ల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేసి తమ పిల్లలకు విద్య ఆటంకం లేకుండా కొనసాగించడానికి సరైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# 'ట్రంప్' భారాలతో ఆక్వా కుదేలు



## - ఎకరాకు రూ.40 వేల వరకూ నష్టం

**అమలాపురం,తెలంగాణ దిశ :**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వేసిన ఎగుమతి సుంకాలతో ఆక్వా రంగంపై తీవ్ర ప్రభావం పడింది. గతంలో మూడు శాతం ఉన్న సుంకం ఉండేది. ఆగస్టు ఒకటి నుంచి 25 శాతం, ఆగస్టు 27 నుంచి 50 శాతం పెరిగింది. దీంతో, వ్యాపారులు ధర తగ్గించేయడంతో ఆక్వా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రస్తుతం తగ్గిన ధరల నేపథ్యంలో ఎకరాకు రూ.40 వేల వరకూ నష్టపోయారు. 50 శాతం సుంకం అమలులోకి వచ్చాక నాలుగు రోజుల్లోనే 30 కౌంట్‌పై రూ.60, వంద కౌంట్‌పై రూ.50 ధర పడిపోయింది. 40, 50, 60, 70, 80, 90 కౌంట్లపై రూ.20 ధర తగ్గింది. ధర మరింత తగ్గితే నష్టం తీవ్రంగా నష్టపోతామని ఆక్వా రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అధికారికంగా 60 వేల ఎకరాల్లో, అనధికారికంగా 20 వేల ఎకరాల్లో మొత్తంగా 80 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. ఆక్వా చెరువులకు అనుసంధానంగా సముద్ర తీర ప్రాంతంలో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, హేచరీలు, కోల్డ్ స్టోరీజీలు ఉన్నాయి. వీటన్నింటిపైనా ట్రంపు సుంకాల భారం కనిపిస్తోంది. జిల్లా నుంచి ఎక్కువగా అమెరికా, చైనాలకు రొయ్యల ఎగుమతులు జరుగుతున్నాయి. ఇందులో 60 శాతం వరకూ అమెరికాకే ఎగుమతి అవుతున్నాయి. 30 శాతం చైనాకు, మిగిలిన 10 శాతం ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నట్లు వ్యాపారులు చెప్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఏటా మూడు లక్షల టన్నుల నుంచి నాలుగు లక్షల టన్నుల వరకూ రొయ్యల ఎగుమతి జరుగుతున్నాయి.

సన్న, చిన్నకారు రైతులకు రూ.2 లక్షల వరకూ నష్టం: ట్రంప్ సుంకాల పేరుతో వ్యాపారులు రొయ్యల ధరలను (అన్ని రకాల కౌంట్‌లకు సంబంధించి) రూ.30 నుంచి రూ.60 తగ్గించేశారు. దీనివల్ల రైతులకు ఎకరాకు రూ.40 వేల వరకూ నష్టం వాటిల్లుతోంది. జిల్లాలో కనిష్టంగా మూడు ఎకరాల నుంచి ఆక్వా సాగు చేస్తున్నారు. ఐదెకరాలలోపు పండించే రైతులు, కౌలు రైతులే ఎక్కువగా ఉన్నారు. పెరిగిన ఎగుమతి సుంకాల నేపథ్యంలో ప్రస్తుతం వీరు రూ.1.20 లక్షల నుంచి రూ.2 లక్షల వరకూ నష్టపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము ఆక్వా సాగు చేయలేమని వారు చెబుతున్నారు. అమెరికాకు ప్రధానంగా 30 కౌంటు రొయ్యలను మాత్రమే ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. ఎగుమతికి పనికి రాని వంద కౌంట్ రొయ్య ధర కూడా వ్యాపారులు తగ్గించేశారని రైతులు వాపోతున్నారు. నెల క్రితం వంద కౌంట్ కేజీ ధర రూ.260 ఉండగా, ప్రస్తుతం రూ.200కే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఎకరాలో రొయ్యల సాగుకు రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ ఖర్చు అవుతోందని, ప్రసుత్త పరిస్థితుల్లో చేతికి రూ.5 లక్షలు రావడం కూడా గగనంగానే ఉందని వాపోతున్నారు.

# పాక్ నయవంచక విధానాలు !



ఆపరేషన్ సిందూర్ ద్వారా చావుదెబ్బతిన్న పాకిస్థాన్...కాల్పుల విరమణ ఒప్పందాన్ని తెరపైకి తెచ్చి, మరింత నష్టం జరక్కుండా చూసుకుంది. లేకుంటే భారత్ చేతిలో చావుదెబ్బ తినివుండేది. కానీ ఇప్పుడా విషయం మరచిపోయింది. మళ్లీ యుద్ధ ప్రేలాపనలు పేలుతోంది. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్భాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాటలే ఇందుకు నిదర్శనం. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నారు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు. నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయ లేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డారు. ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శించబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అయితే వీటిని ఓ హెచ్చరికగా తీసుకుని జాగ్రత్తగా ఉండాల్సిన పాక్ నేతలు తరచూ మాటలు పేలుతూనే ఉన్నారు. ఇదంతా కేవలం అమెరికా అండచూసుకునే అని వేరుగా చెప్పనక్కరలేదు. అమెరికా కూడా గతాన్ని మరచి పాక్‌కు పాలుపోసి పెంచుతోంది. ఎందుకంటే ద్రోహం, వంచనకు మారుపేరు పాకిస్తాన్. ఇన్నాళ్లు కష్టకాలంలో ఆర్థికంగా, సైనికంగా రక్షిస్తూ వస్తున్న డ్రాగన్ కంట్రీ చైనాకు పాకిస్తాన్ నమ్మకద్రోహం చేస్తోంది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌లు అమెరికా పంచన చేరి, చైనా ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారు. రెండుదేశాల మధ్య పాకిస్తాన్ డేంజరస్ గేమ్ ఆడుతోంది. ఇటీవల, పాకిస్తాన్ ట్రంప్‌తో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగు తోంది. ముఖ్యంగా, ఇరు దేశాల మధ్య ఖనిజ ఒప్పందం కుదిరింది. దీంతో బలూచిస్తాన్ ప్రాంతంలోని రేర్ ఎర్త్ మినరల్స్,రాగి వంటి లోహాలను అమెరికా కొల్లగొట్టడానికి చూస్తోంది. దీనికి పాకిస్తాన్ ప్రభుత్వం ప్రత్యక్షంగా సహకరిస్తోంది. నిజానికి ఇంతకాలం చైనాతో చెట్టాపట్టాలేసుకుని తిరిగింది. ఆపరేషన్ సిందూర్ లో కూడా చైనా సాయం తీసుకుంది. అమెరికా దగ్గరకు పిలిచి ముద్దు చేయడంతో ఇప్పుడు చైనాకు చెక్ పెట్టి అమెరికా పంచన చేరింది. అమెరికా, పాకిస్తాన్ స్నేహం భారత్‌కు ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే అమెరికా మద్దతుతో పాక్ బలుపు మాటలు మాట్లాడుతోంది. ఇక పస్నీ ద్వారా భారత వ్యూహాత్మక ఓడరేవు చాబహార్‌ని కౌంటర్ చేయవచ్చు. అమెరికా స్నేహం పాకిస్తాన్‌కు మిలిటరీ, ఇంటెలిజెన్స్ వంటి వ్యూహాత్మక సహకారాన్ని అందించవచ్చు. ఈ చర్యల ద్వారా పాకిస్తాన్తన రక్షణ ఒప్పందాలను మెరుగు పరుచుకోవచ్చు. పాకిస్తాన్ భౌగోళిక రాజకీయ విశ్వాసాన్ని పెంచుతుంది. భారత్‌తో పోలిస్తే తన స్థానాన్ని బలోపేతం చేస్తుంది. ఈ చర్యలు ఇరాన్‌కు కూడా ప్రమాదకరమే. ఇరాన్ షిప్పింగ్ లైన్లపై అమెరికా నిఘా పెరుగుతుంది. అమెరికా, పాక్ బందంపై భారత్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ట్రంప్ ఇప్పుడు భారత్‌ను ఇబ్బంది పెట్టే ఏ చర్యను కూడా వదలడం లేదు. నిజానికి పాకిస్తాన్ ద్వారా అరేబియా సముద్రానికి మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని 60 బిలియన్ డాలర్లతో చైనా చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రారంభించింది. బలూచిస్తాన్‌లో గ్వాదర్ పోర్టును నిర్మించింది. అయితే, ఇప్పుడు ఈ గ్వాదర్ పోర్టుకు కేవలం 70 మైళ్ల దూరంలో అమెరికాతో కలిసి పస్నీ ఓడరేవును నిర్మించేందుకు పాకిస్తాన్ సిద్ధమైంది. ఇది భారత్ ఇరాన్‌లో నిర్మిస్తున్న చాబహార్ పోర్టుకు కేవలం 178 మైళ్ల దూరంలోనే ఉంది. చైనా, భారత్, ఇరాన్, ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాలకు కీలమైన ఈ వ్యూహాత్మక స్థానాన్ని పాకిస్తాన్ అమెరికాకు స్థానం కల్పిస్తోంది. ఈ ఓడరేవు అరేబియా, హిందూ మహాసముద్రంలోని సముద్ర భద్రతకు కూడా చిక్కులు కల్పిస్తుంది. ఈ పస్నీ ఓడరేవు ద్వారా బలూచిస్తాన్‌లోని ఖనిజ సంపదను అమెరికాకు తరలించవచ్చని పాకిస్తాన్ భావిస్తోంది. అయితే, ఇప్పటి వరకు దీనిపై రెండు దేశాలు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఒక వేళ కార్యరూపం దాల్చితే, చైనాతో పాటు భారత్ ప్రయోజనాలకు కూడా తీవ్ర భంగం కలిగించవచ్చు. దీని నిర్మాణానికి 1.2 బలియన్ డాలర్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ఓడరేవు బ్యాటరీ టెక్నాలజీ, క్షిపణుల తయారీ, అధునాతన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల్లో ఉపయోగించే రాగి, యాంటిమోనీ, నియోడైమియం వంటి ఖనిజాల ఎగుమతులకు గేట్‌వేగా మారుతుంది. సెప్టెంబర్ 8న పాకిస్తాన్ మిలిటరీ ఇంజనీరింగ్ కార్ప్స్‌తో 500 మిలియన్ల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. పాకిస్తాన్ ఈ ఖనిజాల షిప్‌మెంట్‌ను మిస్సోరీకి చెందిన జా స్ట్రాటజిక్ మెటల్స్‌కి ఎగుమతి చేసింది. అమెరికాను మచ్చిక చేసుకుని భారత్‌పై పగతీర్చుకోవడానికి పాక్ వెనకాడకపోవచ్చు. ఆ దేశ రక్షణమంత్రి, ఆర్మీ చీఫ్‌లు అడపాదడపా చేస్తున్న వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సిందే.



## మహిళలు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**రాజన్న సిరిసిల్ల,తెలంగాణ దిశ :**మానసిక ఆరోగ్య దినోత్సవంను పురస్కరించుకొని మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రభుత్వ సాధారణ వైద్యశాల ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై మహిళలకు ప్రముఖ సైకాలజిస్ట్ కె.పున్నం చందర్ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ పున్నంచందర్ మాట్లాడుతూ.. మహిళలు మానసిక ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఇటీవలి కాలంలో మహిళలు కుటుంబం, ఉద్యోగం, సామాజిక బాధ్యతలు, వ్యక్తిగత జీవితం మధ్య సమతౌల్యం సాధించడంలో అత్యధిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ ఒత్తిడి ఫలితంగా ఆందోళన, నిరాశ, నిద్రలేమి, కోపం, శారీరక అనారోగ్యాలు ఏర్పడుతున్నాయని అన్నారు. మహిళలు తమ కుటుంబ అవసరాలనే కాకుండా, తమ వ్యక్తిగత మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా సంరక్షించుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఒక సంతోషకరమైన తల్లి, భార్య, ఉద్యోగిని కావాలంటే, ముందు మనసు ప్రశాంతంగా ఉండాలని అన్నారు. మానసిక ఆరోగ్యం కోసం మహిళలు ప్రతిరోజూ స్వీయ సంరక్షణ, మంచి అలవాట్లు అవలంబించాలని తెలిపారు. సరైన నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, యోగా, స్నేహితులతో సంభాషణ, అవసరమైతే సైకాలజిస్టు సహాయం పొందడం లాంటివి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ సిబ్బంది రాపెల్లి లత, బూర శ్రీమతి, కొండ ఉమ, మహిళలు పాల్గొన్నారు.

# పక్షులకు రక్షణ...

చాలామంది ఇళ్లలో ఇప్పుడు పక్షులు కనిపిస్తున్నాయి. అలవాటుగా కొందరుబీ ఆహ్లాదం కోసం మరికొందరుబీ నమ్మకాలు, విశ్వాసాలను పాటిస్తూ ఇంకొందరు.. వాటిని పెంచుకుంటున్నారు. అందమైన బోనుల్లో ఉంచి.. వాటిని అపురూపంగా చూసుకుంటున్నారు. అయితే, తెలియకుండా చేసే కొన్ని చిన్నచిన్న పొరపాట్లు.. పక్షులకు ప్రాణాంతకంగా మారుతుంటాయి. అలా అవ్వొద్దంటే.. కింది సూచనలు పాటించాలి.కొందరు పక్షులకు ప్రేమగా.. చాక్లెట్లు, చిప్స్, స్నాక్స్ తినిపిస్తుంటారు. అవి వాటికి ఏమాత్రం సురక్షితం కాదు. శుభ్రమైన తాజా పండ్లు, విత్తనాలు మాత్రమే అందించాలి. పక్షుల దగ్గర ఘాటైన క్లీనింగ్ స్ప్రేలు, ఎయిర్ ఫ్రెష్‌నర్లను, బాడీ స్ప్రేలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపయోగించవద్దు. పిట్టల ఊపిరితిత్తులు చాలా సున్నితంగా ఉంటాయి. బాగా అలవాటైన తర్వాత పక్షులను ఇంట్లో ఫ్రీగా వదిలేస్తారు. అలాంటప్పుడు వాటికి ఇంట్లోని కొన్ని వస్తువులతో హాని కలిగే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా.. సీలింగ్ ఫ్యాన్లు తిరుగుతున్నప్పుడు పక్షులను బోను నుంచి బయటికి తీయకపోవడమే మంచిది. కొన్నిరకాల పెంపుడు పక్షులు




బొమ్మలతో ఆడుకుంటాయి. అలాంటి బొమ్మలు కొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. పెయింట్ వేయని చెక్క బొమ్మలైతే మంచిది. చిన్నచిన్న భాగాలుగా విడిపోయే ప్లాస్టిక్ బొమ్మలు.. ప్రమాదాన్ని తెచ్చిపెడతాయి. పక్షులు వాటిని ఆహారంగా పొరబడి మింగే అవకాశం ఉంటుంది. వంటగది పొగ కూడా పక్షుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. కిచెన్‌లో ఉపయోగించే ఆయిల్స్, వెనిగర్, మిరపకాయ వంటి వాసనలను పక్షులు అసహ్యించుకుంటాయి.

# పోటీ చేసే అభ్యర్థులకు ఈసీ గైడ్ లైన్స్

**నిజామాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. మొత్తం 5దశల్లో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, 3 దశల్లో సర్పంచ్, వార్డు ఎన్నికలకు ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రాణి కుముది ని షెడ్యూల్ విడుదల చేశారు. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. త్వరలో ఎన్నికలు జరగనున్నందున అభ్యర్థుల అర్హతలు, నామినేషన్, డిపాజిట్ నగదు, వ్యయం పరిమితులపై తెలంగాణ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రేషన్ డీలర్లు పోటీ చేయడానికి అవకాశం ఉంది. అయితే నామినేషన్ల పరిశీలన తేదీ నాటికి 21 ఏళ్లు నిండిన వారిని అర్హులుగా పరిగణిస్తారు. గ్రామ సేవకులు, అంగన్వాడీ కార్యకర్తలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఎయిడెడ్ సంస్థలు, స్థానిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు సైతం పోటీ చేయవచ్చు. పోటీ చేసే గ్రామం, స్థానిక నియోజకవ ర్గంలో అభ్యర్థి ఓటు హక్కు కలిగి ఉండాలి. మతసంబంధమైన సంస్థల చైర్మన్లతో పాటు సభ్యులకు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. సింగరేణి, ఆర్టీసీలో మేనేజింగ్ ఏజెంట్, మేనేజర్ లేదా సెక్రటరీ హోదాలో పనిచేసే వారు మినహా ఇతర ఉద్యోగులు పోటీకి అర్హులు. క్రిమినల్ కోర్టులో కొన్ని నేరాలకు శిక్ష పడిన వారు, శిక్ష విధించిన తేదీ నుంచి 5 సంవత్సరాల వరకు ఎన్నికకు అనర్హులవుతారు. పౌర హక్కుల పరిరక్షణ చట్టం–1955 పరిధిలోకి వచ్చే కేసుల్లో శిక్ష పడినవారు పోటీ చేసేందుకు అనర్హులు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఏదైనా పనికి కాంట్రాక్టు చేసుకున్నా లేదా నిర్వహణకు ఒప్పందం చేసుకున్నా (కాంట్రాక్టర్లు) స్థానిక ఎన్నికల్లో అనర్హులు అవుతారు. స్థానిక సంస్థల అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ధారించింది. జడ్పీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ.4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ.1.5 లక్షలు ఖర్చు చేయవచ్చు. ఇక 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థి రూ.2.5 లక్షల వరకు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉంటే రూ.1.5 లక్షల వరకే ఖర్చు చేయాలని ఈసీ పేర్కొంది.
అలాగే 5000 కంటే జనాభా ఎక్కువ ఉన్న పంచాయతీలో వార్డు సభ్యుడు రూ.50 వేలు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉంటే గరిష్టంగా రూ.30 వేలు ఖర్చు చేయవచ్చు. అభ్యర్థులు తప్పనిసరిగా తమ బ్యాంక్ ఖాతా వివరాలను సమర్పించాలి. దాంతో పాటు ఎన్నికల ఖర్చుల వివరాలు ఇవ్వాలి. అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు తమ అర్హతలు, క్రిమినల్ చరిత్ర, ఆస్తులతో పాటు అప్పులు, చదువు వివరాలపై సెల్ఫ్ డిక్లరేషన్ అఫిడవిట్ దాఖలు చేయాలి. ఒక్క వివరాలు లేకపోయినా నామినేషన్ రిజెక్ట్ అవుతుంద. అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటారు.
అభ్యర్థులు ఎంత డిపాజిట్ చేయాలి..: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పోటీచేసే కేటగిరీని బట్టి డిపాజిట్ చేయాలి. జడ్పీటీసీ అభ్యర్థి (జనరల్?) అయితే రూ.5 వేలు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు అయితే రూ. 2,500 డిపాజిట్ చేయాలి.
ఎంపీటీసీ అభ్యర్థులు రూ.2,500 (జనరల్).. ఎస్సీ,ఎస్టీ,బీసీ అభ్యర్థులు రూ.1,250.. సర్పంచ్ ?అభ్యర్థి జనరల్ అయితే రూ.2 వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1000.. వార్డు సభ్యుడు జనరల్ అయితే రూ.500.. ఎస్సీ,ఎస్టీ, బీసీలు యితే రూ.250 డపాజిట్ చేయాలి. అభ్యర్థులు పంచాయతీల పన్ను బకాయిలతో పాటు కరెంట్ బిల్లులు చెల్లించి రసీదులు తీసుకోవాలి.


# తండాలో మెరిసిన చిత్రకళ



పేదరికం, వెనుకబాటుతనం ఒకేచోట నివసించే తండాలో ఓ బిడ్డకు పుట్టుకతోనే చిత్రకళ అబ్బింది. తన ప్రతిభేంటో తనకే తెలియదు. హైదరాబాద్‌లో ఉన్నత చదువులు చదువుతూ కుంచె పడితే మట్టిలో మాణిక్యం బయటపడింది. ప్రొఫెషన్ కోర్సులు చేసేంత స్తోమత లేదు. తల్లిలేని బిడ్డను తండ్రిలా ఆదరించిన కోచ్ ఆమెను కళా ప్రపంచంలోకి నడిపించాడు. పెండ్లితో ఎంతోమంది కళాకారిణుల ప్రయాణం ఆగిపోతుంది. కానీ, ఆమె కళల విహారం వివాహంతో మరో మలుపు తిరిగింది. పల్లెలోనే ఉంటూ ప్రపంచ నగరాలకు తను గీసిన చిత్రాలను పరిచయం చేస్తున్నది బాధవత్ వెంకటలక్ష్మి. మాది మెదక్ జిల్లా నర్సాపూర్ దగ్గర్లోని జానకంపేట. చిన్నప్పటి నుంచీ ఏదో ఒకటి చేయాలనే తపన ఉండేది. మాది పల్లెటూరు కావడంతో అక్కడ ఏం చేయడానికి ఉండేది కాదు. నాకు తోచినట్టుగా బొమ్మలు గీస్తూ ఉండేదాన్ని. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ చదవడం కోసం హైదరాబాద్ వచ్చాను. కాలేజ్ అయిపోయిన తర్వాత హాస్టల్‌లో ఖాళీగా ఉండకుండా ఏదో ఒకటి నేర్చుకోవాలనుకున్నాను. దగ్గర్లో ఏయే ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయో వెతికాను. మా హాస్టల్‌కి దగ్గర్లోనే ఒక ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ కనిపించింది. చిన్నప్పటి నుంచి కాలక్షేపం కోసం బొమ్మలు గీసే దాన్ని కదా%®% ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ చూడగానే అందులో ఏదో ఉత్సాహం కలిగింది. ఇన్‌స్టిట్యూట్ నడిపే ప్రవాత్ సార్‌కి నా డ్రాయింగ్స్ చూపిస్తే.. ఇంప్రెస్ అయిపోయారు. 'ఇంతకాలం ఎక్కడున్నావ్. ఏం చేస్తున్నావ్? బాగా డ్రాయింగ్ వేస్తున్నావ్. వెంటనే చేరండి' అన్నారు.
తండ్రిలాంటి సార్..: వారంలో మూడు రోజులు సాయంత్రం ఆర్ట్ క్లాసులు ఉండేవి. పెన్సిల్‌తో డ్రాయింగ్స్ గీసేదాన్ని. సార్ షేడింగ్స్ ఇవ్వడం నేర్పించారు. చాలా తొందరగా నేర్చుకున్నాను. నేను గీసిన



బొమ్మలు చూసి.. 'ఇంత బాగా వేస్తున్నావ్. నువ్వే నా ఇన్‌స్టిట్యూట్ నడిపేలా ఉన్నావ్!' అని సార్ ప్రోత్సాహించారు. 'నీకున్న టాలెంట్‌కి ఈ ఫీల్డులోకి ముందే వచ్చుంటే మంచి ఆర్టిస్ట్‌గా పేరొచ్చేది. నీ లైఫ్ సెటిల్ అయ్యేది' అని నాలో స్ఫూర్తిని నింపారు. నా ఆర్ట్‌ని మెచ్చుకునేందుకు మా అమ్మానాన్నలతో మాట్లాడాలని ప్రవాత్ సార్ అనుకున్నారు. ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ అడిగారు. 'మా నాన్న మేస్త్రీ పని చేసేవాడు. నాకు చాలా చిన్న వయసు ఉన్నప్పుడే చనిపోయాడు. మా అమ్మకు ఆరోగ్యం బాగుండదు. మేము ముగ్గురం అక్కచెల్లెళ్లం. మా నాయనమ్మే నన్ను చదివిస్తున్నది' అని చెప్పాను. అప్పుడు సార్ 'నువ్వు నేర్చుకోవాలనుకున్నంత కాలం నేర్చుకో. ఫీజు అడగను.
నువ్వు ఓ స్టేజ్‌కి వచ్చిన తర్వాత లక్ష కాదు రెండు లక్షలు ఇచ్చినా తీసుకుంటాను. అప్పటి వరకు ఫ్రీ' అని చెప్పారు. అన్నట్టే ఆయన ఫీజు తీసుకోలేదు. ఆర్ట్ టీచర్‌గా: ఎమ్మెస్సీ, ఆర్ట్ కోచింగ్.. రెండిటినీ మేనేజ్‌చేయలేకపో యాను. ఇంట్రస్ట్ ఉన్నా సీరియస్‌గా నేర్చుకోలేదు. ఎమ్మెస్సీ అయిపోయింది. ఇంతలో కరోనా వచ్చింది. ఇంటికే పరిమితమ య్యాను. సార్ చెప్పిన టిప్స్, ఇచ్చిన నాలెడ్జ్ తోటి బొమ్మలు గీయడం ప్రాక్టీస్ చేస్తూ వచ్చాను. అప్పుడప్పుడూ సార్‌కి కాల్ చేసేది. ఆయన చెప్పిన ట్రిక్స్ ఫాలో అయ్యేది. ఆయన అన్ని రకాల పెయింటింగ్స్ నేర్పించారు. స్కెచ్, షేడింగ్స్, పోర్ట్రెయిట్, అక్రిలిక్స్, ఆయిల్ కలర్, వాటర్ కలర్ పెయింటింగ్స్ గీయడం నేర్పించారు. ఒక కంపెనీ ఆన్‌లైన్‌లో ఆర్ట్ ట్రైనింగ్‌కి సెలెక్ట్ అయ్యాను. అందులో ఏ గ్రేడ్ సాధించాను. తర్వాత వాళ్లే నన్ను టీచర్‌గా తీసుకున్నారు. రెండేళ్లు ఆన్‌లైన్‌లో ఆర్ట్ పాఠాలు చెప్పాను. ఆర్ట్ కమ్యూనిటీ అర్బన్ స్కెచెస్‌లో చేరాను. వాళ్లతో కలిసి అర్బన్ స్కెచ్‌లు గీశాను.
ఒకడుగు వెనక్కి..: అయిదేండ్ల కిందట నాకు పెండ్లయింది. ఆ తర్వాత



పిల్లలు. ఇంట్లో పనులకే సమయం సరిపోతున్నది. మళ్లీ ఉద్యోగంలో చేరలేదు. ఫైన్ ఆర్ట్స్ చదవాలని రెండేళ్ల కిందట తెలుగు విశ్వవిద్యాలయం ఎంట్రన్స్ రాశాను. నాలుగో ర్యాంక్ వచ్చింది. జేఎన్ఏఎఫ్‌యూ ఎంట్రన్స్‌లో అరవై నాలుగో ర్యాంక్ వచ్చింది. పిల్లల బాధ్యత కారణంగా వెనకడుగు వేశాను. అయినా మా ఆయన సపోర్ట్‌తో ఆర్టిస్ట్‌గా ముందుకు వెళ్తున్నాను. నర్సాపూర్ దగ్గర ఒక స్కూల్లో ఆర్ట్ టీచర్‌గా చేరాను. పిల్లలు కాస్త పెద్దవాళ్లు అయ్యాక నేను మిస్ చేసుకున్న ఫైన్ ఆర్ట్స్ కోర్స్ చదువుతాను.
రెండడుగులు ముందుకు..: ఆర్ట్ నేర్చుకునే రోజుల్లో.. నా ఫ్రెండ్‌కి పెండ్లి కుదిరింది. ఆమెకు పోర్ట్రెయిట్ గీసి, గిఫ్ట్ ఇచ్చాను. అప్పుడే నేను బొమ్మలు గీస్తానని నలుగురికీ తెలిసింది. నేను టీచర్‌గా పనిచేస్తున్న స్కూల్లో.. ఓ టీచర్ నాతో వాళ్లన్నయ్య బొమ్మ గీయించుకుంది. ఆ సంతోషాన్ని తన వాట్సాప్ స్టేటస్‌లో పంచుకుంది. దానివల్ల మరికొంతమందికి నా గురించి తెలిసింది. అప్పటి నుంచి ఆర్డర్లు వస్తూనే ఉన్నాయి. ఆర్డర్ ఇచ్చినవాళ్ల ద్వారా నలుగురికి తెలియడం, మరికొన్ని ఆర్డర్లు రావడంతో నాకు చేతినిండా పని ఉంటున్నది. ఇప్పుడు ఆన్‌లైన్‌లో ఎక్కడెక్కడి నుంచో ఆర్డర్లు వస్తున్నాయి. ఏ పెయింటింగ్ వేయమంటే అది వేస్తాను.
పోర్ట్రెయిట్స్, చేర్యాల పెయింటింగ్స్, దేవతలు, ల్యాండ్‌స్కేప్స్ వేస్తాను. ఏమీడియం ఆర్డర్ చేస్తే మీడియం వేసి ఇస్తున్నాను. నాకు దేవుడిచ్చిన టాలెంట్ ఇది. నలుగురికి చూపించాలి. చిత్రకళ నాకు దొరికిన నేస్తం.అలాగే యూట్యూబ్ చానెల్ ద్వారా ఆర్ట్ పాఠాలూ చెబుతున్నాను. నన్ను చదివించిన నాయనమ్మకు సదా రుణపడి ఉంటాను. ఈ కళలో మంచి స్థాయికి చేరుకోవాలన్న కల అయితే ఉంది! అందుకోసం నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాను.

## అయోధ్య తరహాలో మార్కండేయ దేవాలయ పునర్నిర్మాణం కోసం నిధి సమర్పణ

**రాజన్న సిరిసిల్ల,తెలంగాణ దిశ:**సిరిసిల్ల మార్కండేయ వీధిలో అత్యంత పురాతనమైన విశిష్టమైన శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయము పునర్నిర్మాణంకై శ్రీ మార్కండేయ స్వామి జయంతి మహోత్సవ సమితి ఒక కార్యచరణను ప్రారంభించిందని శ్రీ మార్కండేయ స్వామి జయంతి మహోత్సవ సమితి కన్వీనర్ మోర శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత రెండు నెలల నుండే పద్మశాలి కుల బంధువులతో,హిందు బంధువులతో సమాజంలోని అందరిని కలుపుకుని పోయే విధంగా దేవాలయాల ఆధారంగా 22 సమావేశాలను శాంతి నగర్ 'నుండి భూపతినగర్' వరకు, చంద్రంపేట నుండి సాయినగర్ వరకు నిర్వహించి అభిప్రాయాలను సేకరించామని తెలిపారు. దేవాలయ పునర్నిర్మాణం హిందూ సంఘటనా శక్తికి, ఆత్మ గౌరవానికి, సమరసతకు చిహ్నంగా శ్రీ లలితా పరమేశ్వరీ లక్ష్మీనారాయణ సహిత శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయాన్ని పునర్నిర్మా ణములో సామాన్యుడి నుండి సం పన్నుడి వరకు అందరినీ భాగస్వామ్యం చేయాలని భావించి అందుకు నిధిసమర్పణ కార్యాచరణను ప్రారంభించి అందరి అభిప్రాయా లను సేకరించామని తెలిపారు. అతి త్వరలోనే దేవాలయ నిధి సమర్పణ కార్యాచరణను ప్రారంభం చేస్తున్నామని అది కూడా వారం పది రోజులలో ప్రారంభిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము అన్నారు. ఇటీవల అయోధ్య లో భవ్యమైన దివ్యమైన అయోధ్య రామమందిర నిర్మాణముకై జరిపిన నిధి సమర్పణ కార్య విధానమే స్ఫూర్తిగా తీసుకుని సామాన్యుడి నుండి సంపన్నుడి వరకుఅందరం దేవుడి ముందర సమానమేఅనే భావనతో ప్రయత్నం చేసి సిరిసిల్ల లో దివ్యమైన భవ్యమైన శ్రీ మార్కండేయ ఆలయాన్ని పునర్నిర్మాణం చేద్దామని ఇది మనందరి సంఘటితశక్తికి, స్వాభిమానాత్మ గౌరవానికి ప్రతీకగాఉంటుందని తెలిపారు.

# టీడీపీ నేతల మధ్య సమన్వయం కరువు

**గుంటూరు,తెలంగాణ దిశ :** తెలుగుదేశం పార్టీ కేంద్ర పార్టీ కార్యాలయం సక్రమంగా పనిచేయడం లేదా? పార్టీ కార్యాలయం వల్లనే పార్టీ ఇన్ని రకాలుగా ఇబ్బందులు పడుతుందా? నేతల మధ్య సమన్వయం లేకపోవడానికి కూడా పార్టీ కేంద్ర పార్టీ కార్యాలయం అనుసరిస్తున్న మెతక వైఖరి అని చెబుతున్నారు. చంద్రబాబు నాయుడు చేతుల్లోకి తెలుగుదేశం పార్టీ వచ్చిన తర్వాత 1995 నుంచి ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ ఏం మాట్లాడాలన్నా అది ముందు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారం ఇవ్వాల్సి ఉండేది. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ లో ఉన్న ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో మీడియా సమావేశం పెట్టాలన్నా, లేకపోతే అసెంబ్లీ సమావేశాల్లో ఏ విషయాలను అయినా ప్రస్తావించాలన్నా ముందుగా పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారం అందించాల్సి వచ్చేది. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో ఉండే... ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో ఉండే లైబ్రరీలో అన్ని అంశాలకు సంబంధించిన విషయాలు.. అసెంబ్లీ చట్టాలకు సంబంధించిన సమగ్ర సమాచారం లభ్యమయ్యేది. నాడు దేవేందర్ గౌడ్ నుంచి కింది స్థాయి నేత వరకూ లైబ్రరీకి వెళ్లే అలవాటు ఉండేది. వారు అసెంబ్లీ సమావేశాల్లోనో, మీడియా సమావేశాల్లోనూ మాట్లాడాలంటే లైబ్రరీకి వెళ్లి తాము మాట్లాడబోయే అంశానికి సంబంధించిన వాటిపై అధ్యయనం చేసేవారు. గతంలో ఉన్న విషయాలను కూడా వారు ఆకళింపు చేసుకునే వారు. అధికారంలో ఉన్నప్పుడైనా, లేకపోయినా సరే ఖచ్చితంగా ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు వచ్చి అందుకు సంబంధించిన అంశాలను పరిశీలించేవారు. కానీ రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆ సంప్రదాయానికి నేతలు నీళ్లొదిలేశారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయానికి వారికి కేటాయించే సమయంలో మాత్రమే ఎమ్మెల్యేలు వస్తున్నారు. సబ్జెక్ట్ పై అవగాహన కోసం కానీ, తాము మాట్లాడలనుకున్న విషయాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి తెలియపర్చేందుకు ఇష్టపడటం లేదు. పార్టీ కేంద్ర కార్యాలయం కూడా దీనిని పట్టించుకోవడం లేదు. సీనియర్ నేతలకు మాత్రమే ఈ విషయం తెలుసు. ఇప్పుడంతా కొత్త తరం నాయకులు కావడంతో పార్టీ కేంద్ర కార్యాలయాన్ని అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతోనే సమస్యలు వస్తున్నాయన్న అభిప్రాయం టీడీపీ సీనియర్ నేతల్లో వ్యక్తమవుతుంది. చంద్రబాబు నాయుడు, లోకేశ్ పాలనలో బిజీగా ఉండటంతో పార్టీ కేంద్ర కార్యాలయం చూసుకోవాల్సి ఉన్నా వాటిని పట్టించుకోకపోవడంతో ఈ రకమైన సమస్యలు అసెంబ్లీలో గాని, బయట గాని తలెత్తుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇందుకు సంబధించి బలోపేతం చేస్తే బాగుంటుందన్న సూచనలు వస్తున్నాయి.

# డ్రోన్ సిటీకి గ్రీన్ సిగ్నల్




కర్నూలు, : ఏపీకి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది కేంద్రం. ముఖ్యంగా ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఏపీకి అధిక ప్రాధాన్యం ఇస్తూ వస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ తరచూ ఏపీలో పర్యటిస్తూ కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ వస్తున్నారు. మరోసారి ఈనెల 16న ఏపీలో పర్యటించను న్నారు ప్రధాని నరేంద్ర మోడీ. అయితే కేవలం శ్రీశైలం ఆలయ సందర్శనే కాకుండా ప్రధాని కర్నూలులో డ్రోన్ సిటీకి శంకుస్థాపన చేస్తారని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అందుకు సంబంధించి ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యట నకు సంబంధించి సచివాలయంలో ఆర్టిజిఎస్ కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు సీఎం చంద్రబాబు. అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. అమరావతిని డ్రోన్ల హబ్ గా మార్చాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు కర్నూలులో డ్రోన్ల సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. డిసెంబర్లో ఏపీలో భారీ డ్రోన్ షో నిర్వహించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. అన్ని రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరగాలని.. ఆ దిశగా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. డ్రోన్ సిటీ అనేది చంద్రబాబు డ్రీమ్ ప్రాజెక్ట్. ప్రధాని నరేంద్ర మోడీ ఈనెల 16న కర్నూలులో పర్యటించనున్నారు. మూడు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. అదే వేదికపై ప్రధాని చేతుల మీదుగా డ్రోన్ సిటీని ప్రారంభించనున్నారు. కాగా ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రోడ్ షో నిర్వహించనున్నారు.ప్రధాని నరేంద్ర మోడీ శ్రీశైలం ఆలయ సందర్శన సందర్భంగా పురావస్తు శాఖ ప్రదర్శన ఏర్పాటు చేయనుంది. ఆలయ సంపద గురించి ప్రధానికి వివరించి ప్రయత్నం చేయనుంది. మరోవైపు భారీ బహిరంగ సభ ఏర్పాటుకు సంబంధించి అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు చంద్రబాబు. దాదాపు మూడు లక్షల మందితో భారీ బహిరంగ సభకు ప్లాన్ చేస్తున్నారు. ఇదే సభలో కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించనున్నారు

# జిల్లా యువతకు ఉన్నత విద్యావకాశాలు

వరంగల్: ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని గట్టమ్మ గుట్ట వద్ద ప్రతిష్టాత్మక సమ్మక్క సారలమ్మ కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన ముఖ్య ఘట్టం జరిగింది. రాష్ట్ర పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఈ సందర్భంగా కీలక ప్రకటన చేశారు. ఈగిరిజన విశ్వవిద్యాలయం ద్వారా ఈ ప్రాంత యువతకు ఉన్నత విద్యావకాశాలు మెరుగుపడతాయని, ముఖ్యంగా గిరిజన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ ప్రతిభను పెంచుకునేందుకు ఇదొక బలమైన వేదిక అవుతుందని ఆమె అన్నారు. రూ.24కోట్ల వ్యయంతో 8.4కిలోమీటర్ల పొడవైన ప్రహరీ గోడ నిర్మాణపనులకు ఆమెశంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో మహ బూబాబాద్, ఆదిలాబాద్ పార్లమెంట్సభ్యులు పోరిక బలరాం నాయక్, జి. నాగేష్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి అగ్ర ప్రాధాన్యం ఇస్తుందని.. ఈ యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమై న నిధులు,మౌలిక సదుపాయాలు సమకూర్చుతామని హామీ ఇచ్చారు. విద్యార్థుల కోసం ఆధునిక గ్రంథాలయాలు, ప్రయోగశాల లు, హాస్టళ్లు, తరగతి గదులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ములుగు జిల్లాకు ఈ విశ్వవిద్యాలయం ప్రత్యేక గౌరవాన్ని, విద్యా రంగంలో కొత్త మైలు రాయిని అందిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ.. ఈ నూతన విశ్వవిద్యాలయంలో 80 శాతం ప్రవేశ అవకాశాలు స్థానిక విద్యార్థులకే దక్కుతాయని స్పష్టం చేశారు. ఇది ప్రాంతీయ ప్రతిభను వెలికి తీయడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు నాగేష్.. ఈ ప్రాంత గిరిజనుల విద్యాభివృద్ధి, వారి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు విశ్వవిద్యాలయం దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే.. ఇది ఆర్థిక అభివృద్ధిలోనూ ముఖ్య భూమిక పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణకు సెంట్రల్ గిరిజన యూనివర్సిటీ మంజూరు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ.. రాబోయే ఐదేళ్లలో 3 వేల నుంచి 5 వేల మంది విద్యార్థులు ఇక్కడ ఉన్నత విద్యను అభ్యసించవచ్చని అంచనా వేశారు. ప్రస్తుతం 42 మంది విద్యార్థులు కేంద్రీయ ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశాలు పొంది విద్యనభ్యసిస్తున్నారని, వారికి నైపుణ్యాభివృద్ధి కోసం టాస్క్ సెంటర్ ద్వారా శిక్షణ కూడా అందిస్తున్నామని వివరించారు.

# అదాని సిమెంట్ కంపెనీ నిర్మాణం ప్రతిపాదనను రద్దు చేయాలి

**మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తే తిరుగుబాటు తప్పదు**

**సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం డిమాండ్**



**విశాఖ,తెలంగాణ దిశ:** పెదగంట్యాడ వద్ద అదాని అంబుజా సిమెంట్ కంపెనీని ర్మాణం ప్రతిపాదనను రద్దు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులుకె.లోకనాథం డిమాండ్ చేశారు. జగదాంబ సిఐటియు కార్యాలయంలో సిపిఎం జిల్లా కమిటీ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బుధవారం పెదగం ట్యాడలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో వేలాదిమంది ప్రజలు పాల్గొని అదాని సిమెంట్ కంపెనీ తమకు వద్దు అంటూ నినదించి, పెద్ద ఎత్తున నిరసన తెలిపారని పేర్కొన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన స్టేజిని పగలగొట్టడం, కుర్చీలు విసిరివేయడం బట్టి చూస్తే, నిరసన ఎంత స్థాయిలో ఉ ందో ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. ప్రజల నిరసనతో ప్రజాభి ప్రాయ కార్యక్రమాన్ని రద్దు చేయటం జరిగిందని, ఆర్డీవో ప్రకటించా రని చెప్పారు. సాయంత్రం మరోసారి ఆర్డీవో ప్రకటన చేస్తూ, ఈ ప్రతిపాదనను రద్దు చేయలేదని, మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తామని ప్రకటించారని తెలిపారు. ఆర్డీవో చేసిన ప్రకటన పట్ల లోకనాథం తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఏదైనా ఒక కంపెనీ ఏర్పాటు చేసే సమయంలో నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు అంగీకరిస్తే కంపెనీ ఏర్పాటు చేయడం, ప్రజలు వ్యతిరేకిస్తే, ప్రతిపాదనను రద్దు చేయడం మాత్రమే చేయాలన్నారు. వాయిదా వేయటం చట్ట విరుద్ధం అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ కంపెనీ ఏర్పాటును రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ.. అదాని సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రాంతంలో, చుట్టుపక్కల ఉన్న అన్ని గ్రామాల ప్రజలు దీనిని వ్యతిరేకించారని చెప్పారు. గంగవరం పోర్ట్ వల్ల ఈ ప్రాంతం ప్రజలు నిత్యం ఎదుర్కొం టున్న అనేక సమస్యలను దృష్టిలో ఉ ంచుకొని, పోర్టును నిర్వహిస్తున్న అదానీ కంపెనీ ఇప్పుడు సిమెంట్ కంపెనీని అదే ప్రాంతంలో ఏ ర్పాటు చేయడం కుదరదని రాజకీయాల అతీతంగా అన్ని పార్టీలకు చెందిన, అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తిరుగుబా టు చేశారని చెప్పారు. ఇంత జరుగుతున్నా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అదానీ సిమెంట్ కంపెనీ ఏర్పాటు చేయవద్దని ప్రకటించడానికి బదులు, వారికి వత్తాసు పలికే విధంగా మాట్లాడ టం దుర్మార్గం అన్నారు. విశాఖపట్నం ఎంపి శ్రీభరత్ కూడా దీనిపై స్పందించకపోవడం శోచనీయం అన్నారు. ప్రజల అభిప్రా యాన్ని పరిగణలోకి తీసుకోకుండా మరోసారి ప్రజాభిప్రాయ సేకర ణకుసిద్ధపడితే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చ రించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి కుమార్, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

# అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేస్తాం..

**– ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి**

**తొట్టంబేడు,తెలంగాణ దిశ :** శ్రీకాళహస్తి నియోజకవర్గం లో ప్రజలకు ఎంతో అవసరమైన అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ం ప్రాంగణంలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎనిమిదవ రాష్ట్రీయ పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతి?థిగా పాల్గొన్న బొజ్జల మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకున్నపుడే ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియో గపర్చుకోవాలని కోరారు. బాలింతలకు, కిశోర్ బాలికలకు, చిన్నారులకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహా రాన్ని సరఫరా చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# పెరాలసిస్ వారి కోసం ఆవిష్కరణ

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**టెక్నాలజీ సాయంతో పూర్తిగా శరీరం పక్షవాతానికి గురైన వారికి సహాయం అందించే పరికరాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు రూపొందించారు. ఈ నూతన ఆవిష్కరణ పక్షవాత రోగులకు స్వతంత్రంగా జీవించే అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ పరికరం సహాయంతో రోగులు తమ వీల్‌చైర్‌ను నియంత్రించడం, అర్జెంట్‌గా ఎదైనా అవసరం అయితే అభ్యర్థించడం, ఇంట్లోని విద్యుత్ పరికరాలను కూడా ఆపరేట్ చేయడం సాధ్యమవుతుం ది.బయోమెడికల్ ఫైనల్ ఇయర్ ఇంజినీరింగ్ చదువుతున్న ఈ విద్యార్థులు రూపొందించిన ఈ ప్రాజెక్ట్‌కు 'పక్షవాత రోగుల కోసం ఇంటిగ్రేటెడ్ సహాయక సాంకేతిక వ్యవస్థ అని పేరు పెట్టారు. ఈ ఆవిష్కరణ 'హాక్-ఎ-బోర్డ్ హ్యాకథాన్' ఫైనల్‌లో మొదటి బహుమతిని గెలుచుకుంది. ఈ పరికరం పని చేయడానికి ముఖ్యంగా మూడు టెక్నాలజీలను ఉపయోగించారు. ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్ . వినియో గదారు ముఖ కదలికలను గుర్తించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఎసీ).. దీని ద్వారా ఇంటిలోని స్విచ్‌లు వంటి వాటిని నియంత్రించవచ్చు. బాహ్యంగా జత చేసిన స్క్రీన్.. ఆదేశాలను వీక్షించడానికి ఉపయోగపడుతుందిఈ బృందంలోని హారిక అనే విద్యార్థి మాట్లాడుతూ.. మెడ కింది భాగం నుండి కండరాల కదలికను కోల్పోయిన రోగులు కుటుంబ సభ్యులపై పూర్తిగా ఆధారపడటం తప్ప వేరే మార్గం లేదని అన్నారు. అలాంటి వారికి సహాయం చేయాలనే ఉద్దేశంతోనే ఈ ఉత్పత్తిని రూపొందించినట్లు, దీనిని ఏ వీల్‌చైర్‌కు లేదా బెడ్‌కు అయినా జత చేయవచ్చని వివరించారు. వినియోగదారు ముక్కు కొన స్థానాన్ని ట్రాక్ చేయడం ద్వారా వివిధ పనులు చేస్తుంది. వీల్‌చైర్‌కు జతచేసిన స్క్రీన్ ముందు వినియోగదారు ముఖాన్ని లేదా తలను కదిలించి.. ఒక నిర్ణీత స్థానంలో మూడు సెకన్ల పాటు ఆపితే.. యాక్షన్ ఎంపిక అవుతుంది. అత్యవసర పరిస్థితుల్లో ముందుగా నమోదు చేసుకున్న కొన్ని నంబర్‌లకు కాల్ చేసి సహాయం కోరడానికి కూడా ఇది అవకాశం ఇస్తుంది. దీనివల్ల ఇతరులపై ఆధారపడటం తగ్గుతుంది.ఈ ప్రాజెక్ట్‌లో పనిచేసిన మరో విద్యార్థి వెంకట జైదీప్ దత్తా మాట్లాడుతూ..

ఈ వ్యవస్థను ప్రాథమిక శిక్షణతో కూడా ఆపరేట్ చేయవచ్చని.. ఇది అందుబాటులో, చౌకగా ఉంటుందని తెలిపారు. మార్కెట్లో ప్రస్తుతం ఉన్న ఖరీదైన ఉత్పత్తులకు ఇది తక్కువ ధరకే అంటే.. సుమారు రూ.8,000 నుండి రూ.10,000 మధ్య ఉంటుందన్నారు. ముఖ్యం గా.. మాట్లాడలేని వారికి కూడా ఈ వ్యవస్థ ఎంతో ఉపయోగపడు తుంది. ఆహారం, నీరు కావాలని కోరడం లేదా రెస్ట్ రూమ్‌కి వెళ్ళడా నికి సహాయం అడగడం వంటి ప్రాథమిక అవసరాలకు దీనిని వినియో గించుకోవచ్చు. ఈ వ్యవస్థ ఇంగ్లీషుతో పాటు తొమ్మిది భారతీయ భాషలలో సమాచార మార్పిడికి సపోర్ట్ చేస్తుందన్నారు.

# మధిర మిర్చి మార్కెట్‌లో కోల్డ్ స్టోరేజ్ సిబ్బంది..

# ఏపీ వ్యాపారి అక్రమ దందా..?



**మధిర,తెలంగాణ దిశ :** మధిర మిర్చి మార్కెట్ యార్డ్‌లో కోల్డ్ స్టోరేస్ సిబ్బంది, ఏపీ వ్యాపారి అక్రమ దందాతో అక్రమ లావాదేవీలు కొనసాగుతున్నట్లు రైతులు ఆరోపణలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని రెండో పెద్ద మార్కెట్‌గా మధిర వ్యవసాయ మార్కెట్ నిలిచింది. ఈ మార్కెట్ పరిధిలోని మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మధిరలోని కొన్ని కోల్డ్ స్టోరేజీలు, వాటిల్లో పనిచేసే సిబ్బంది కేవలం ఒకే ఆంధ్రా మిర్చి వ్యాపారస్తుడికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ?ఆ వ్యాపారి ఇచ్చే కమీషన్లకు ఆశపడి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రైతులను మోసం చేసి నష్టపరుస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమాలకు ఏఎంసీ చైర్మన్ గానీ, మార్కెట్ శాఖ సెక్రెటరీ గానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

బహిరంగ వేలం లేకుండానే కట్టబెట్టడం ?కొన్ని సందర్భాలలో కోల్డ్ స్టోరేజ్ల సిబ్బంది ధరను బహిరంగంగా ప్రకటించకుండానే, నిల్వ ఉ ంచిన రైతుల మిర్చిని అప్పనంగా ఆ ఆంధ్ర వ్యాపారస్తుడికి కట్టబెడుతు న్నట్లు సమాచారం. మిర్చి వ్యాపారం చేయడానికి లైసెన్స్ కంటే కమీషన్ ప్రధానం అన్నట్లుగా వ్యవహారం నడుస్తోంది. లోకల్ వ్యాపార స్తులు ఎగుమతిదారులు (ఎక్స్‌పోర్ట్ సప్లైయర్స్) మధిర మార్కెట్‌లో లావాదేవీలు కొనసాగిస్తున్నప్పటికీ, కేవలం ఆ ఆంధ్ర వ్యాపారికి మాత్రమే కావాల్సిన సరుకు, కోరుకున్న ధరకు దొరుకుతుండడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని మిగతా వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

మార్కెట్ యార్డ్‌కు తలనొప్పిగా మారిన వ్యవహారం:

రైతుల సరుకును ముందుగా మార్కెట్ యార్డ్‌కు తీసుకువచ్చి, మిగతా వ్యాపారులకు చూపించిన తర్వాత, వారికి సంబంధించిన వ్యాపారికి (ఆంధ్ర వ్యాపా రికి) కట్టబెడుతూ కాటాలు వేయడం జరుగుతోందని తెలుస్తోంది. మార్కెట్ యార్డ్‌లో ఈ రేటు అడిగారు అంటూ ఇతర వ్యాపారులకు తప్పుడు సమాచారం ఇచ్చి, లోకల్ రైతులను వ్యాపారులను మోసం చేస్తున్నారని అనుమానాలకు దారి తీస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఈ అక్రమ లావాదేవీలపై నిలదీసిన కొంతమంది వ్యాపారులకు కోల్డ్ స్టోరేజ్‌యాజమానులు కానీ, ఏఎంసీ చైర్మన్ కానీ, అధికారులు కానీ కనీసం జవాబు కూడా ఇవ్వడం లేదు.అడిగిన కాడికికాటాలేస్తే ఎక్కువ కమీషన్ వస్తుందనే ఉద్దేశంతో కొందరు గుమస్తాలు కేవలం ఒక్క వ్యాపారిని మాత్రమే ప్రోత్సహిస్తున్నారని మిగతా వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ?ఈ తంతు కోల్డ్ స్టోరేజ్ యజమానులకు తెలిసే కొనసాగుతున్నట్లుగా సమాచారం. ఈ వ్యవహారం ఏఎంసీ చైర్మన్‌కు, మార్కెట్ శాఖ సెక్రెటరీకి పెద్ద తలనొప్పిగా మారింది. మార్కెట్‌లో ఈ అక్రమ దందా ఇలాగే కొనసా గితే, పూర్తి ఆధారాలతో ఖమ్మం జిల్లా కలెక్టర్ కిమార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు కొంతమంది వ్యాపారస్తులు రైతులతో కలిసి మీడియా ద్వారా హెచ్చరికలు జారీ చేశారు.

మిర్చి మార్కెట్‌లో దందాపై రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు తప్పవు: మార్కెట్‌లో కోల్డ్ స్టోరేజీ గుమస్తాలు, ఆంధ్ర వ్యాపారి మిర్చి మార్కెట్లో దందా చేస్తున్నారనే విషయం తన దృష్టికి రాలేదని మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు స్పష్టం చేశారు. రైతులు ఎవరైనా స్వయంగా వచ్చి నిర్దిష్ట ఫిర్యాదు చేస్తే, వారిపై పై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మిర్చి వ్యాపారులందరూ తప్పనిసరిగా ట్రేడింగ్ లైసెన్స్ తీసుకోవాలని గత మార్కెట్ కమిటీ సమావేశంలో స్పష్టంగా సూచించడం జరిగింది. లైసెన్స్ లేకుండా రైతుల నుంచి మిర్చి కొనుగోలు చేయడం మార్కెట్ నిబంధనలకు విరుద్ధం. వ్యాపారులు ఇప్పటికైనా లైసెన్స్ తీసుకొని కొనుగోలు చేయాలి. లేనిపక్షంలో, వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని నరసింహారావు హెచ్చరించారు.

# పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమము

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయంలో భాగంగా శ్రీకాళహస్తిలో ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ నందు పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో 64 వ వారం శ్రీమతి డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమమును పవన్ కళ్యాణ్ ఆశయాల కృషి కోసం పనిచేసే జనసేన నాయకులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీమతి డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం నిర్వాహకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి తొట్టంబేడు మండలంఉపాధ్యక్షులు తేజ, లక్ష్మణ్, ప్రదీప్ కుమార్, మనీ, ముని చంద్ర, యాసీన్ భాష, రాజా, నాగరాజువీర మహిళలు బత్తెమ్మ, పద్మ, తదితరులుహెపాల్గొన్నారు.

# అమెరికా చదువులకు బైబై!

**ఆ దేశానికి వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్యలో భారీ తగ్గుదల**

**ట్రంప్ ఆంక్షలతో ప్రత్యామ్నాయ దేశాల వైపు మన యువత చూపు**



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దెబ్బ విద్యార్థులపై గట్టిగా పడటంతో యూఎస్ వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది గణనీయంగా తగ్గిపోయింది. ఇది కొవిడ్ మహమ్మారి సమ యంలో నమోదైన తగ్గుదలను సూచిస్తున్నది. న్యూయార్క్ టైమ్స్ విశ్లేషించిన ట్రేడ్.జీవోవి డాటా ప్రకారం 2025లో ఆగస్టులో అమెరి కాకు వచ్చే భారతీయ విద్యార్థుల సంఖ్య గత ఏడాది ఆగస్టుతో పోలిస్తే 44 శాతం తగ్గింది. భారతీయ విద్యార్థులు అమెరికాలో ఉన్నత చదువులకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తుంటారు. ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమేటిక్స్ (స్టెమ్) కోర్సులు ఎక్కువ గా చదువుతుంటారు. అయితే ట్రంప్ తీసుకున్న నిర్ణయాలతో అంతా తలకిందులైంది. దీంతో ఈ ఏడాది పరిస్థితి వేరేగా ఉంది. ఏకంగా 44 శాతం మంది విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. ఇది మిగిలిన అన్ని దేశాల కన్నా భారీ తగ్గుదలగా పేర్కొంటున్నారు. అయితే మొత్తం మీద అన్ని దేశాల విద్యార్థుల సంఖ్య 19 శాతం తగ్గుదల నమోదు కాగా, భారతీయ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది.భారతీయ విద్యార్థులు తగ్గారా?: అమెరికాకు వెళ్లే విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా తగ్గిపోయిందంటే, విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గిపోయినట్టు మనం భావించ రాదు. ఎందుకంటే మన దేశం నుంచి అమెరికాకు వెళ్లడం తగ్గిందేమో కానీ, విద్యార్థులు దానికి ప్రత్యామ్నాయ దేశాలను ఎంపిక చేసుకుని వెళ్తున్నారు.వారు తమ గమ్యాలను ఇప్పుడు బహుముఖం చేస్తున్నారు. వారు ఇప్పుడు కెనడా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ, కొన్ని అరబ్ దేశాలను అమెరికాకు ప్రత్యామ్నాయాలుగా ఎంచుకుంటున్నారు. కాగా, భారత్‌తో పాటు మిగిలిన దేశాల విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో వాటి దుష్పరిణామాలను అమెరికా యూనివర్సిటీలు ఇప్పటికే స్పష్టంగా ఎదుర్కొంటున్నాయి.

# భారత్ నిర్ణయాలను శాసించలేం

**ఎవరితో సంబంధాలు కొనసాగించాలన్నది వారి ఇష్టం**

**రష్యా చమురు కొనుగోళ్లే భారత్ ఆర్థికి వృద్ధికి కారణం కాదు**

**ట్రంప్ సలహాదారు జెమిసన్ గ్రీర్ వెల్లడి**



న్యూయార్క్ : అమెరికా అధ్యక్షుడికి మెల్లగా సొంత వర్గం నుంచే వ్యతిరేకత వస్తోంది. ఆయన చర్యలు కొందరు జీర్ణించుకోలేక పోతున్నారు. దీంతో యాదార్థాలన ముక్కుసూటిగా చెప్పేస్తున్నారు. ప్రధానంగా రష్యా నుంచి భారత్ ఆయిల్ కొనుగోలుపై ట్రంప్ తీరును తప్పుపడుతున్నారు. భారత్ సార్వభౌమత్వ దేశమని ట్రంప్ సలహాదారు జెమిసన్ గ్రీర్ అన్నారు. ఆ దేశం సొంత నిర్ణయాలు తీసుకోగలదని తెలిపారు. ఇతర దేశాలు ఎవరితో సంబంధాలు కొనసాగించాలి.. ఎవరితో కొనసాగించ కూడదు అనేది మేం చెప్పాలనుకోవడం లేదు. ఈ విషయంలో మేం ఎవర్నీ శాసించడం లేదు అని గ్రీర్ తెలిపారు. రష్యా నుంచి కొనుగోలు చేసే చమురే భారత ఆర్థిక వ్యవస్థకు ఆధారం కాదని అమెరికా వాణిజ్య ప్రతినిధి, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారు జెమిసన్ గ్రీర్ అన్నారు. అయినా ఇప్పటికే భారత్ తన చమురు కొనుగోళ్లను మాస్కో నుంచి మళ్లిస్తోందని తెలిపారు. న్యూయార్క్‌లో జరిగిన ది ఎకనామిక్ క్లబ్‌లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాతో భారత్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయి. కానీ, గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో మాస్కో నుంచి చమురును కొనుగోలు చేయలేదు. డిస్కౌంట్ ధరల కారణంగా గత రెండు, మూడేళ్ల నుంచి రష్యా చమురును ఎక్కువగా కొంటోంది. ఇది కేవలం వినియోగం కోసం మాత్రమే కాదు.. ఆ చమురును శుద్ధి చేసి రీసేల్ చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే భారత ఆర్థిక వ్యవస్థకు రష్యా చమురు కొనుగోళు ఒక్కటే బలమైన ఆధారం కాదని అర్థమవుతోంది. అందుకే వారు ఇతర దేశాల నుంచి కొనుగోలు చేయాలని సూచిస్తున్నాం. దీన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ఇప్పటికే వారు ఈ విషయంలో వైవిధ్యభరిత చర్యలు ప్రారంభించడం మేం చూస్తున్నాం అని గ్రీర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. అమెరికాతో వాణిజ్యం కారణంగా భారత్‌కు 40 బిలియన్ డాలర్లకు పైగా మిగులు ఉంటోంది. మేం వారికి విక్రయించే దానికంటే.. భారత్ మాకు అమ్మేవే ఎక్కువ. అయితే, రష్యా చమురును కొనుగోలు చేయడంతో ఉక్రెయిన్‌పై యుద్ధానికి పుతిన్‌కు న్యూఢిల్లీ వనరులను అందించినట్లవుతోంది. మాస్కోపై ఒత్తిడి తెచ్చేందుకే భారత్‌పై ఈ స్థాయిలో సుంకాలు విధించాల్సి వచ్చింది. అయితే, టారిఫ్‌ల విషయంలో అమెరికాతో ఆ దేశం గొప్ప డీల్ చేసుకుంటోందని గ్రీర్ వెల్లడించారు. దీనిని బట్టి మెల్లగా వాస్తవాలను ట్రంప్ బృందం గుర్తిస్తోందని తెలుస్తోంది.

# ఎకరం రూ.177 కోట్లు



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**హైదరాబాద్‌లోని రాయదుర్గం ప్రాంతంలో భూమి వేలం రికార్డు సృష్టించింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరానికి రూ.177 కోట్లు చొప్పున భూమి పలికింది. టీజీఐఐసీ నిర్వహించిన ఈ వేలంలో, మొత్తంగా ఏడు ఎకరాల 67 సెంట్ల భూమిని ఎంఎస్ఎన్ రియాలిటీస్ అండ్‌న్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేజిక్కించుకుం ది. ఈ సంస్థ మొత్తం రూ.1,357 కోట్లకు ఈ భూమి సొంతం చేసు కుంది.టీజీఐఐసీ అధికారుల ప్రకారం, ఈ వేలం రూ.1,357 కోట్లతో పూర్తి అయింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీ, హైదరాబాద్ షెడ్యూల్డ్ ఏరియాలో భాగంగా ఉన్న ఈ ప్రాంతం, ఐటీ, ఫార్మా, బయోటెక్ వంటి కంపెనీల కార్యాలయాలకు అనుకూలంగా ఉంది. గతంలో రాయదుర్గంలో ఎకరానికి రూ. 100-120 కోట్ల వరకు పలికేవి. ఈ సారి భారీగా పెరిగాయి. ఈ వేలంలో పాల్గొన్న మరో కొన్ని సంస్థలు కూడా పోటీ పడ్డాయి, కానీ ఎంఎస్ఎన్ రియాలిటీస్ అత్యధిక బిడ్‌తో విజయం సాధించింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఉన్న ఈ భూమి, టీజీఐఐసీ అభివృద్ధి చేస్తున్న ఇండస్ట్రియల్ పార్క్‌లో భాగం. వేలం ప్రక్రియలో మొత్తం 7.67 ఎకరాల భూమి వేలం వేశారు. ఎకరానికి రూ.177 కోట్లు ధర నిర్ణయమై, మొత్తం మొత్తంగా రూ.1,357 కోట్లు వసూలైంది. ఈ ధరలో భూమి అభివృద్ధి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సౌకర్యాలు కూడా చేరుతాయి. ఐటీ కారిడార్ మధ్యలో నాలెడ్జ్ సిటీ, ఫార్మా సిటీ, ఐటీ పార్కుల మధ్య ఈ స్థలం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ప్లాన్. గత రెండు సంవత్సరాలుగా ఇక్కడ భూమి ధరలు రెండు రెట్లు పెరిగాయి. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి విపులమైన ఆదాయం లభించడంతో, మరిన్ని ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు మార్గం సుగమమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఎంఎస్ఎన్ రియాలిటీస్ అండ్‌న్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ. ఈ సంస్థ గతంలో కూడా రాయదుర్గం ప్రాంతంలో పెద్ద భూములు కొనుగోలు చేసి, కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రాజెక్టులు అభివృద్ధి చేసింది. ఈ కొత్త భూమిపై ఐటీ పార్కులు, కార్పొరేట్ ఆఫీసులు నిర్మించే అవకాశం ఉంది. టీజీఐఐసీ ఎండీ శశాంక మాట్లాడుతూ.. తాజా ధర రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో మునుపటి రికార్డులను బద్దలు కొట్టిందని తెలిపారు. 2022లో కోకాపేట నియోపోలిస్‌లో జరిగిన వేలంలో ఎకరాకు రూ.100.75 కోట్లు గరిష్ఠ ధర పలికిన రికార్డును.. ఈ రాయదుర్గం నాలెడ్జ్ సిటీ వేలం అధిగమించింది. కొత్త రికార్డు ధర రూ.177 కోట్లు కావడంతో.. ఇది గత కోకాపేట ధర కంటే దాదాపు 75% అధిక వృద్ధిని సాధించినట్లు ఆయన వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం పారదర్శక, వ్యాపారానుకూల వాతావరణాన్ని నిర్మిస్తోందని.. పెట్టుబడిదారులు హైదరాబాద్ భవిష్యత్తుపై ఉంచిన నమ్మకానికి ఈ వేలం నిదర్శనమని శశాంక పేర్కొన్నారు. ఈ వేలాన్ని జేఎల్ఎల్ ఇండియా, ఎంఎస్టీసీ సంస్థల భాగస్వామ్యంతో పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు.ఒకవైపు రాయదుర్గంలో వాణిజ్య భూములకు భారీ ధరలు పలకగా.. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో నివాస భూములు సైతం రికార్డు స్థాయి ధరలను నమోదు చేశాయి. సోమవారం జరిగిన బహిరంగ వేలంలో 513 చదరపు గజాల విస్తీర్ణంలోని ఒక ప్లాట్‌కు చదరపు గజం (చ.గ.) ధర రూ.1.14 లక్షలు పలికింది. హెచ్ఐజీ కేటగిరీకి చెందిన మరో ప్లాట్ చ.గ. 4 ఫ్లాట్లకు గాను హౌసింగ్ బోర్డుకు రూ.44.24 కోట్ల ఆదాయం లభించింది. వేలంలో పాల్గొన్న 27 మంది బిడ్డర్ల కారణంగా చ.గ. సగటు ధర రూ.91,947గా నమోదైంది. ఈ డబుల్ రికార్డులతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ మరింత జోరును సంతరించుకుంది.

# సంక్షేమ పథకాలు కలిసొస్తాయా

**విజయవాడ,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తిరిగి ఎన్నికలు ఎప్పుడు జరిగినా గట్టెక్కిస్తాయని భావిస్తున్నట్లుంది. అందుకే ఆయన పదే పదే సంక్షేమం పదాన్ని వల్లె వేస్తున్నారు. అభివృద్ధి అన్న మాట కంటే ఎక్కువగా సంక్షేమం అనే పదమే ఎక్కువ సార్లు ఆయన నోట వినిపిస్తుంది. గత పదిహేను నెలల కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసింది. పింఛన్లను నాలుగు వేల రూపాయలకు పెంచడంతో పాటు, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, మహిళలకు ఉచిత బస్సు, ఆటో డ్రైవర్లకు పదిహేను వేల రూపాయలు వంటి పథకాలను అమలు చేశారు. వీటితో పాటు తల్లికి వందనంతో పాటు అన్నదాతకు అండగా నిలుస్తూ అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేశారు. సంక్షేమం విషయంలో చంద్రబాబు ను ఎవరూ తప్పుపట్ట లేరు. గత మూడు దఫాలుగా... నిజానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గత మూడు దఫాలు సంక్షేమం అమలు చేసిన దానికంటే ఎక్కువగా ఈ టర్మ్ లో అమలు చేసి చూపుతున్నారు. గతంలో మూడు దఫాలు ఆయన విజన్ తో పనిచేసేవారు. సంక్షేమం అనేది ఆయనకు లీస్ట్ ప్రయారిటీగా ఉండేది. రాష్ట్ర భవిష్యత్ అంటూ సుదూర దృష్టితో ఆలోచించి నిర్ణయాలు తీసుకునే వారు. కానీ ఈసారి మాత్రం చంద్ర బాబు నాయుడు అందుకు భిన్నంగా కనిపిస్తున్నారు. కార్యకర్తల సంక్షే మాన్ని కూడా పూర్తిగా పక్కన పెట్టేశారు. ఇప్పుడంతా సంక్షేమ మంత్ర మే ఆయన నోటి నుంచి వినిపిస్తుండటం ఒకింత పార్టీ నేతలకు ఆశ్చర్యం కలిగిస్తుంది. చంద్రబాబు నాయుడు తన పై ఉన్న అపవా దును చెరిపేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఎందుకంటే చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయరు అన్న వారి నోళ్లను మూయించడానికే సంక్షేమాన్ని భారమైనా భుజానకెత్తు కున్నారంటున్నారు.అయితే సంక్షేమాన్ని అమలు చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే రెండోసారి విజయం సాధించారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోనూ అనేక సంక్షేమ పథకాలను ఇబ్బడి ముబ్బడి గా అమలు చేసిన కేసీఆర్ ను కూడా ప్రజలు ఓడించారు. ఇక గత ప్రభుత్వ హయాంలో దాదాపు 2.75 లక్షల కోట్ల రూపాయల ను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశానని జబ్బలు చరుచుకున్న జగన్ ను కూడా పక్కన పెట్టేశారు. అంటే సంక్షేమం ఎప్పటికప్పుడు టర్న్ అవుతుందా? అన్నది మాత్రం ఇక్కడ అర్థం కావడం లేదు. ఎవరు అధికారంలోకి వచ్చినప్పటికీ గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కంటే ఒకింత ఎక్కువే ఇవ్వాల్సి ఉంటుంది. కోతలు పెట్టడా నికి వీలుండదని భావించి ప్రజలు మార్పును కోరుకుంటే సంక్షేమ మంత్ర పనిచేయదని చెప్పాలి. అందుకే చంద్రబాబు పదే పదే సంక్షేమం నినాదాన్ని అందుకున్నప్పటికీ ఫలితాలు మాత్రం చివర వరకూ చెప్పలేమన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. రానురాను రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు దిగజారిపోవడమే తప్పించి పెరగడం జరగదని తెలిసినా పాలకులు మాత్రం సంక్షేమం వైపునకు పరుగులు తీయడం కొన్నివర్గాల నుంచి పెదవి విరుపులు వినిపిస్తున్నాయి.



# సంక్షేమమేది?

అందరి సంక్షేమమే తమ లక్ష్యమంటూ ఊదరగొడుతున్న ప్రభు త్వాలు అధికారం వెలగబెడుతున్నా.. హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకుం టున్న చిన్నారుల ఆలనాపాలనా పట్టించుకునే వారేలేరు. ఏళ్ల తరబడి కలుషిత నీరు తాగుతున్నా, మెనూ ప్రకారం ఆహారం అందకపోయి నా, హైకోర్టు చీవాట్లు పెట్టినా పరిస్థితుల్లో మార్పేమీ లేదు. గిరిజన ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పార్వతీపురం జిల్లా కురుపాం గిరిజన బాలికల గురుకుల పాఠశా లలో కలుషిత నీరు తాగడం వల్లే 9, 10 తరగతులు చదువుతున్న ఇద్దరు విద్యార్థిను లు ప్రాణాలు కోల్పోయారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న 611 మంది బాలికల్లో 140 మంది పచ్చకామెర్లకు గురై జిల్లా కేంద్ర, విశాఖ కెజిహెచ్‌లలో చికిత్స పొందుతున్నారు. సాంఘిక, ఆర్థిక అసమానతల కారణంగా చదువులు అర్ధాంతరంగా ఆగిపోకూడదన్న సంకల్పంతో గురుకు లాలు, వసతి గృహాలు ఏర్పాటయ్యాయి. 39 (ఎఫ్) రాజ్యాంగ అధికరణం ప్రకారం ఆరోగ్యకరమైన, గౌరవ ప్రదమైన, స్వేచ్ఛాయుత పరిస్థితుల్లో ఎదిగే అవకాశాలను, సౌకర్యాలను పిల్లలకు అందిస్తూ పీడన, వెలివేతల నుంచి కాపాడటం ప్రభుత్వాల బాధ్యత. 46వ అధికరణం ప్రకారం అణగారిన వర్గాల విద్య, ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తూ సామాజిక అన్యాయం, దోపిడీల నుంచి వారిని రక్షించాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేటీకరణ విధానా లతో విద్య అంగడి సరుకుగా మారిపో యింది. రాజ్యాంగం నిర్దేశించిన కర్తవ్యాల అమలు ఊసేలేదు. సరళీకరణ విధానాలతో కాయకష్టం చేసే వారికి రోజూ పనులు దొరక్కపోవడం, ఉంటుందో, ఊడుతుందో తెలీని ప్రైవేటు ఉ ద్యోగాలు, తగ్గిపోయిన వేతనాలు, పెరిగిన పని గంటలు, కుటుంబాలు గడవడమే కష్టమవుతున్న పరిస్థితుల్లో రాష్ట్రం లో, పేద, అణగారిన వర్గాలకు చెందిన నాలుగు లక్షల మందికిపైగా పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లే ఆధారమవుతున్నాయి. వీటికి సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడం, డైట్ ఛార్జీలు చెల్లించకపోవడం ఆనవాయితీగా మారిపోయింది. మెనూ అమలు ఊసేలేదు. పౌష్టికాహారం అందకపోవడం, తాగునీటి కాలుష్యం, అపరిశుభ్రత తదితర కారణాల వల్ల తరచూ అతిసార, విషజ్వరాలు, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు గురవడం సర్వసాధారణమైపోయింది. విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనలు సైతం వెలుగుచూస్తున్నాయి.

రాష్ట్రంలో 65 హాస్టళ్లను పరిశీలించిన డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ%ా% నర్సీపట్నంలోని ఓ బాలికల హాస్టల్‌లో 228 మంది విద్యార్థినులకు ఒకే మరుగుదొడ్డి, ఒకటే బాత్రూమ్ ఉండటంసహా అనేక సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ పరిస్థితిపై చలించిపోయిన రాష్ట్ర హైకోర్టు విద్యార్థులకు తగినన్ని మరుగుదొడ్లు, బాత్రూమ్‌లు లేకపోతే ఎలా? అవసాన దశలో ఉన్న హాస్టల్ భవనాలు కూలిపోతే విద్యార్థులేం కావాలి? మన ఇంట్లో పిల్లల్ని నేలపై పడుకోబెడతామా? ఏటా ప్రభుత్వం కేటాయించే కోట్ల రూపాయలు ఏమవుతున్నాయి? నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సిపిసిఆర్) గైడ్‌లైన్స్ ప్రకారం మౌలిక వసతులన్నీ ప్రభుత్వమే కల్పించాలంటూ గత జులైలో ప్రభుత్వాన్ని ఆదేశించింది. జిల్లా సీనియర్ అధికారులు నెలవారీగా తనిఖీలు చేయాలని, ఆ నివేదికలను తెప్పించుకోవాలని సిఎస్‌లను ఆదేశించింది. హైకోర్టు ఇంత ఆగ్రహం వ్యక్తం చేసినా%ా% పరిస్థితుల్లో ఏమాత్రం చలనం లేదనడానికి కురుపాం హాస్టల్ దుస్థితే నిదర్శనం. ఆర్‌ఒ సిస్టమ్ పాడై, పరిశుభ్రమైన తాగునీరు అందుబాట్లో లేకపోవడమే విద్యార్థినుల ప్రాణాంతక పచ్చకామెర్లకు ప్రధాన కారణం. పిల్లలు ఇళ్ల వద్ద చనిపోతే ప్రభుత్వానిది బాధ్యతెలా అవుతుందని, నష్టపరిహారం ఎలా ఇస్తామని పార్వతీపురం జిల్లాకే చెందిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి వ్యాఖ్యానించారు. కనీస మౌలిక వసతులు కల్పించడంలో వైఫల్యం వల్లే వారు హాస్టళ్లలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారన్న విషయాన్ని పట్టించుకోకపోవడం సమంజసమా? బాధితులు, గిరిజనులు డిమాండ్ చేసిన విధంగా%ా% మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించడంతోపాటు సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. పిల్లలకు, వృద్ధులకు హాస్టళ్లు ఉన్నాయని, పశువులకు కూడా హాస్టళ్లు ఏర్పాటు చేస్తామని ఇటీవల సిఎం ప్రకటించారు. పిల్లల హాస్టళ్లను మెరుగుచేయకుండా పశువులకు హాస్టల్ అనడం సమంజసమేనా? కేరళలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో, ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరగడానికి అక్కడి ప్రభుత్వ విధానాలే కారణమని గుర్తించాలి. ఆర్థిక, సామాజిక అంతరాలకు అతీతంగా నవతరాన్ని తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వాలు కార్యాచరణలోకి దిగితేనే ఇటువంటి పరిస్థితులను అధిగమించగలం

## అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి యువకుడు మృతి..

**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ దిశ :** మండలంలోని పేగడపల్లి గ్రామానికి చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి గ్రామానికి చెందిన గోపగోని అజయ్ కుమార్ బీటెక్ ఫెయిల్ అవ్వడంతో, మద్యానికి, ఇతరత్రా జల్సాలకు అలవాటు పడి స్వగ్రామమైన పేగడపల్లికివచ్చి వ్యవసాయం పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు.ఆక్రమంలో, వ్యవసాయ పనుల పెట్టుబ డికొరకుఅని తండ్రి సదయ్యతో అప్పులుతెప్పించి ఆడబ్బుతో మద్యా నికిఖర్చు చేసి అధికంగా రూ.5 లక్షల అప్పు అయ్యాడు.ఇక అప్పులు తీర్చలేక మానసికంగా కుంగిపోయిన మృతుడు అజయ్, గత రోజునతన వ్యవసాయ పొలం వద్దనేగడ్డి మందు తాగాడు. అంతే కాకుండా తానే స్వయంగా బంధువులకు పురుగుల మందు తాగిన ట్లు సమాచారం ఇవ్వడంతో, వెంటనే కుటుంబ సభ్యులు వ్యవసా య క్షేత్రం వద్దకు చేరుకుని చికిత్స నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స కొనసాగిస్తుండగా మృతి చెందాడు. ఇక మృతుడి తండ్రి గోపగాని సదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్టు ఎస్సై తెలిపారు.



# సినిమా..

## పెళ్లి పీటలు ఎక్కబోతున్న త్రిష..?



టాలీవుడ్, కోలీవుడ్ లో లెజెండరీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న అందాల త్రిష పెళ్లి గురించి మళ్లీ చర్చలు ఊపందుకున్నాయి. తాజాగా కోలీవుడ్ సర్కిల్స్‌లో త్రిష పెళ్లికి సంబంధించిన వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. తల్లిదండ్రులు చూసిన సంబంధానికి ఆమె ఓకే చెప్పిందనే టాక్ నడుస్తుంది. త్రిష గతంలో బిజినెస్ మ్యాన్ వరుణ్ మనియన్‌తో నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ నిశ్చితార్థం పెళ్లివరకు దారి తీస్తుందని అనుకోగా, అనూహ్యంగా అది రద్దయింది. అప్పటి నుంచి త్రిష తన కెరీర్‌పైనే దృష్టి సారించింది. మనసుకు నచ్చినవాడు దొరికితే తప్పక పెళ్లి చేసుకుంటాను అని త్రిష గత కొన్నాళ్లుగా చెబుతూ వస్తుంది. తాజా సమాచారం ప్రకారం, త్రిష తల్లిదండ్రులు చండీఘర్‌కు చెందిన ఓ కుటుంబంతో సంబంధం కుదిర్చినట్లు తెలుస్తోంది. ఆ యువకుడు ఆస్ట్రేలియాలో స్థిరపడి బిజినెస్ చేస్తున్నట్టు సమాచారం. ఇటీవల తన వ్యాపారాన్ని భారత్‌లో విస్తరించాడని కూడా చెబుతున్నారు. రెండు కుటుంబాలు దగ్గరైన నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని త్రిష కూడా ఈ సంబంధానికి ఓకే చెప్పినట్లు కోలీవుడ్‌లో చర్చ నడుస్తుంది. అయితే ఈ విషయంపై త్రిష నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం త్రిష చిరంజీవి హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'విశ్వంభర' లో నటిస్తోంది. అదే సమయంలో తమిళంలో 'కరుప్పు' అనే చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. ఇవే ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న ప్రధాన ప్రాజెక్టులు. మునుపటి క్రేజ్ తగ్గిన నేపథ్యంలో ఈ రెండు సినిమాలపై చాలా ఆశలు పెట్టుకుంది త్రిష. ఇక బాలీవుడ్‌లో కూడా త్రిష రీఎంట్రీకు ప్లాన్ చేస్తోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఒక్క సినిమాతో బాలీవుడ్ ప్రయాణాన్ని ఆపేసిన త్రిష, ఇప్పుడు మళ్లీ తన అదృష్టాన్ని పరీక్షించాలనుకుంటుందట. మరి తాజాగా త్రిష పెళ్లికి సంబంధించి జరుగుతున్న ప్రచారంలో నిజం ఎంత ఉంది అన్నది తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే. కానీ ఈ సారి మాత్రం త్రిష నిజంగానే పెళ్లి పందిరిలోకి అడుగుపెడుతుంది అన్న ఆశాభావం అభిమానుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

## అందాన్ని తప్పించుకుని తిరుగుతున్న అదృష్టం!



ఇప్పుడంటే రాన్రాను తెరపై కథానాయికలకు చోటు లేకుండా పోతోందిగానీ, ఒకప్పుడు ముగ్గురేసి హీరోయిన్స్ సందడి చేసిన సినిమాలు ఉన్నాయి. ఆ ముగ్గురి వైపు నుంచి చూపించలేని గ్లామర్ ను కొసరు వేయడానికి ఓ ఐటమ్ గాళ్ కావలసి వచ్చేది. ఎందుకంటే సినిమాకి కథాకథనాలు ఎంత అవసరమో, గ్లామర్ కూడా అంతే అవసరమని భావించేవారు. వాళ్ల అభిప్రాయం సరైనదేనని మాస్ ఆడియన్స్ నిరూపించేవారు.అయితే ఆ మధ్య కాలంలో ఓ అందాల హీరోయిన్ తెరపై తెల్ల కలువలా విరిసింది. విశాలమైన కళ్లతో .. విరుగుడు లేని చూపులతో కుర్రకారు ప్రేక్షకులకు కునుకు లేకుండా చేసింది. చక్కని కనుముక్కుతీరుతో వెండితెరకు వెలుగు తీసుకొచ్చిన బ్యూటీగా ఆమెను గురించి చెప్పుకున్నారు. ఆ సుందరి పేరే అనూ ఇమ్మాన్యుయేల్. అనూ లోని ప్రత్యేకమైన ఆకర్షణ ఆమెకి వరుస అవకాశాలు దక్కేలా చేశాయి. దాంతో ఈ బ్యూటీ ఒక రేంజ్ లో దూసుకెళ్లడం ఖాయమని అంతా అనుకున్నారు.

నాని 'మజ్ను'తో ఎంట్రీ ఇచ్చిన ఈ సుందరి, 'అజ్ఞాతవాసి' .. 'నా పేరు సూర్య' సినిమాలతో టాప్ హీరోయిన్ కేటగిరీలోకి వెళ్లిపోతుందని అభిమానులు అనుకున్నారు. కానీ ఆ సినిమాలు మాత్రమే కాదు, ఆ తరువాత చేసినవి కూడా సరిగ్గా ఆడలేదు. ఇప్పుడు కొత్త ప్రాజెక్టులకు సంబంధించి ఈ కోల కళ్ల భామ పేరు ఎక్కడా వినిపించడం లేదు. అదృష్టం ఎదురుపడితే అమ్మడు తప్పుకుపోయిందా? లేదంటే అదృష్టమే తప్పించుకుని పోయిందా? అనేదే అభిమానులకు అర్థం కానీ ప్రశ్నగా మిగిలిపోయింది.

## మహేష్ బాబు-రాజమౌళి మూవీ టైటిల్ లీక్!








సూపర్ స్టార్ మహేష్ బాబు కథానాయకుడిగా, భారత దర్శక దిగ్గజం ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ "గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ ఫిల్మ్" ఇప్పుడు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటికీ, అధికారిక అప్డేట్స్ ఏవీ రాకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరాశగానే ఉన్నారు. అయితే ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ క్రేజీ లీక్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మహేష్ – రాజమౌళి సినిమా టైటిల్‌గా 'వారణాసి' అనే పేరును పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ఇండియన్ మైథాలజీ, యాత్రల నేపథ్యంలో నిర్మించబోతున్న ఈ సినిమాపేరుగా ఈ టైటిల్ ఒక మంచి ఎంపికగా చర్చకు వస్తోంది. వారణాసి అనే నగరం భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. అంతర్జాతీయంగా కూడా ఆధ్యాత్మికతకు చిహ్నంగా గుర్తింపు పొందిన ఈ నగరం పేరు టైటిల్‌గా ఉండటం సినిమాకు ప్రత్యేకమైన పాన్ వరల్డ్ కనెక్షన్‌ని తీసుకువస్తుందని భావిస్తున్నారు. ఇక హాలీవుడ్ లెజెండరీ దర్శకుడు జేమ్స్ కామెరూన్ నవంబర్‌లో భారత్‌కు రానున్నారు. "అవతార్: ద ఫైర్ అండ్ యాష్" ప్రమోషన్‌లో భాగంగా భారత పర్యటనకు వస్తున్న కామెరూన్ చేతుల మీదుగా మహేష్ – రాజమౌళి మూవీ టైటిల్‌ను రివీల్ చేయించాలని జక్కన్న ప్రణాళిక వేస్తున్నట్లు సమాచారం. ఇలా చేయడం వల్ల ఈ సినిమా హైప్ మరింత పెరగనుంది. ఈ గ్రాండ్ మూవీలో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటించనుండగా, పాన్ ఇండియా గుర్తింపు తెచ్చుకున్న ఆర్. మాధవన్, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కథను బట్టి ప్రపంచవ్యాప్తంగా షూటింగ్ జరిపేందుకు ప్రణాళికలు వేస్తున్న జక్కన్న, ఈ సినిమాను ఓ విజువల్ ఎక్స్‌పీరియెన్స్‌గా మలచనున్నారు.దుర్గ ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ ఈ భారీ బడ్జెట్ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందించనుండగా, టెక్నికల్ టీమ్ అంతా ఇంటర్నేషనల్ లెవెల్‌లో ఉండనుంది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రాజమౌళి తెరకెక్కించనున్న ఈ చిత్రం ప్రపంచ సినిమా స్థాయిలో పెద్ద బ్లాక్‌బస్టర్ అవుతుందనే అంచనాలు ఇప్పటికే ఏర్పడ్డాయి.


## ఇక ఆషికా రంగనాథ్ ను ఆపడం కష్టమే!






వెండితెరపై వెలుగు రేఖలా తళుక్కున మెరిసే కథానాయికలు కొందరైతే, వెన్నెల ధారలా తెరపై నుంచి జారిపోయి ప్రేక్షకుల గుండె గదుల్లోకి చేరిపోయే కథానాయికలు మరికొందరు. అందం .. ఆకర్షణతో పాటు నాజూకుతనంతో ఆకట్టుకునే అలాంటి కథానాయికల జాబితాలో ఆషికా రంగనాథ్ ఒకరుగా కనిపిస్తారు. ఆషికా అంటే ఆకాశం నుంచి జారిపోయిన అందాల చందమామ అనే విషయం ఆడియన్స్ కి తొలి సినిమాతోనే అర్థమైపోయింది. 'అమిగోస్' సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన ఈ తమలపాకు లాంటి అమ్మాయి, ఆ తరువాత 'నా సామిరంగ' సినిమాతో భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాకి ఆమె గ్లామర్ ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచింది. దాంతో ఆ సినిమాకి వెళ్లిన వాళ్లంతా థియేటర్లలో తమ మనసులు పారేసుకునే బయటికి వచ్చారు. ఇక ఈ సుందరి ఇక్కడ వరుసబెట్టి సినిమాలు చేయడం ఖాయమని అనుకున్నారు .. కానీ అలా జరగలేదు. ఆషికా ఆచితూచి కథలను ఎంచుకోవడమే ఇందుకు కారణమని అనుకోవాలి. ప్రస్తుతం ఆమె తెలుగులో 'విశ్వంభర' .. తమిళంలో 'సర్దార్ 2' .. కన్నడలో 'గత వైభవ' సినిమాలతో బిజీగా ఉంది. ఈ కన్నడ సినిమా వచ్చేనెల 14వ తేదీన థియేటర్లకు రానుంది. ఇక 'సర్దార్ 2'.. 'విశ్వంభర' కూడా భారీ అంచనాలు ఉన్న ప్రాజెక్టులే. ఈ సినిమాలు హిట్ కొడితే ఇక ఆషికను ఆపడం కష్టమేననే టాక్ బలంగా వినిపిస్తోంది. సీనియర్ స్టార్ హీరోల సరసన ఆమె బిజీగా కావడం ఖాయమేనని అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## బ్లాక్ డ్రెస్సులో జాన్వీ కపూర్ గ్లామర్ షో





ముంబై: జాన్వీ కపూర్ తన ఫ్యాషన్ లుక్స్‌తో స్టన్ చేస్తోంది. జాన్ గల్లియానో బ్లాక్ కలర్ డ్రెస్సులో జిగేల్మంది ఆ బ్యూటీ. 1986 ఫాలన్ ఏంజిల్స్ కలెక్షన్‌కు చెందిన డ్రెస్సింగ్‌ను జాన్వీ ధరించింది. ఫ్రాన్స్ ఉద్యమ కాలంతో 1986 కలెక్షన్‌కు లింకు ఉన్నది. ప్రాచీన గ్రీకు, రోమన్స్‌కు చెందిన సాధారణ స్టయిల్‌లో డ్రెస్సు ఉంటుంది. గల్లియానో డిజైన్‌లో చాలా లైటర్ ఫ్యాబ్రిక్స్ ఉంటాయి. బ్లాక్ చార్‌కోల్ షేడ్‌లో ఉన్న సీజర్ ప్లీట్ డ్రెస్సును జాన్వీ వేసుకున్నది. ఆ ఔట్‌ఫిట్‌కు స్కాలోప్ నెక్‌లైన్ ఉంది. లాంగ్ స్లీవ్స్, కర్వ్ పౌచ్ ప్యాకెట్లు కూడా ఉన్నాయి. ఇక షర్ట్‌కు కూడా క్రాసోవర్ సీజర్ కట్టింగ్‌తో డిజైన్ ఉంది. రియా కపూర్ ఈ డ్రెస్సును స్టయిల్ చేసింది. ఈ ఔట్‌ఫిట్‌కు తగినట్లు హై హీల్స్ వేసుకుంది జాన్వీ. క్లచ్ అండ్ డార్క్ సన్‌గ్లాసెస్ కూడా పెట్టుకుంది ఆ క్యూటీ.

## వయసు ఓ సంఖ్య మాత్రమే.. స్టైలిష్ ఫోటోషూట్‌తో చిరంజీవి

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన ఎనర్జీతో, స్టైలిష్ లుక్స్‌తో అభిమానులను అబ్బురపరిచారు. ఇటీవల రవి స్టూడియోస్ వారి ఆధ్వర్యంలో ఆయన ఇంట్లో నిర్వహించిన ఫోటోషూట్ లో చిరంజీవి మార్చిన ఐదు నుంచి ఆరు కాస్ట్యూమ్స్‌కి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. 70 ఏళ్ల వయసులోనూ చిరు ఇంత యంగ్ లుక్ లో కనిపించడం చూసి నెటిజన్లు ఆశ్చర్యంతో.. 70 ఏళ్ల వయసులోను 40 ఏళ్ల కుర్రాడిలా అదరగొట్టేస్తున్నారు అని కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పర్యావరణ పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటివి మన ఆరోగ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తున్న ఈ రోజుల్లో చిరంజీవిలాంటి హీరోలు చూపిస్తున్న ఫిట్‌నెస్ నిజంగా స్ఫూర్తిదాయకం. ఇది దేవుని వరమో లేకుంటే, ఫిట్‌నెస్ పట్ల పట్టుదల ఫలితమో కాని, ఆయనలోని స్టైల్, గ్రేస్ మాత్రం అసలే తగ్గడం లేదు. ఇటీవల 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంలోని "మీసాల పిల్ల" పాట ప్రోమోలో చిరంజీవి స్టైలింగ్ పై కొంత మంది విమర్శలు చేశారు. అయితే తాజా ఫోటోషూట్ ద్వారా చిరు అటువంటి కామెంట్లకు స్టైలిష్‌గా సమాధానం ఇచ్చినట్లే భావిస్తున్నారు అభిమానులు. ఇక ఈ ఫోటోలు చూస్తే చాలు, ఏం హ్యాండ్సమ్,

ఏం ఛరీష్మా అన్న ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. 'భోళా శంకర్' సినిమా తర్వాత చిరంజీవి కొంత గ్యాప్ తీసుకున్నారు. కానీ 2025లో ఆయన బిజీ బిజీగా ఉన్నారు. జనవరిలో 'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్లకు రాబోతుండగా, ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. వేసవిలో 'విశ్వంభర' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. డైరెక్టర్ బాబీ తో ఒక పవర్‌ఫుల్ యాక్షన్ మూవీ కూడా డిసెంబరు లేదా జనవరిలో సెట్స్ పైకి వెళ్లనుంది. అంతేకాదు, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల తో ఓ వయలెంట్ డ్రామా చేయనుండగా, ఇందులో చిరంజీవి సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215